ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025 | 5







# శాకంబరిగా బాలత్రిపుర సుందరి

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీబాలా త్రిపుర సుందరీ అమ్మవారిని కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం గురు, వ్యాస, ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పండితులు మానేపల్లి సుందర గణేష్ మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. వ్యాసపూర్ణిమ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకుని సుందరేశ్వరస్వామికి విశేషపూజలు చేశారు. శాకంబరీ మాతను మహిళలు దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు.



**కళకళలాడిన వేదికలు :** రాజమహేంద్రవరం మునిసిపల్ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



**గోపాలపురం :** రాజంపాలెంలో విద్యార్థినులు.. తల్లులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్



**అమ్మా నేను ఆకాశానికెళ్లిపోతా :** బిక్కవోలులో ఇలా



నిడదవోలులో విద్యార్థికి పుస్తకం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

**తల్లికి వందనం :** అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లుల కాళ్లు కడిగి పాదాభివందనం చేస్తున్న విద్యార్థినులు




# గోదారి.. వయా..గ్రా!

**మెడికల్ షాపులకు వెళ్లి ఏ మందు అడిగినా లేదనే సమాధానం రాదు..నిన్నటి వరకూ జ్వరం, దగ్గు, జలుబు మందులే అనుకుంటే.. ఇటీవల ఒక యువకుడు పట్టుబడడంతో అసలు విషయం బయటపడింది.. వయాగ్రా, అబార్షన్ మాత్రలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్టు తెలియడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నివ్వెరపోయింది.. డ్రగ్స్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి నిఘా పెట్టగా అన్ని మెడికల్ షాపుల్లోనూ ఈ తంతు నడుస్తున్నట్టు తెలుస్తోంది..**

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రగ్స్ శాఖ మత్తు బిళ్లలు వేసుకోవడంతో మెడికల్ షాపుల వ్యాపారం జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. అధిక శాతం మెడికల్ షాపుల్లో అడిగిందే తడవుగా విచ్చలవిడిగా మందులను విక్రయిస్తున్నారు. ఎంతలా అంటే.. వైద్యుడి చీటీ లేకుండా షెడ్యూల్ 'హెచ్' మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదు. కానీ అవేమీ పెద్దగా పట్టింపు లేకుండా వ్యాపారాలు నడిచిపోతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ (డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్) శాఖలోని పలువురు అధికారులు పలుకుబడి అనే మందు వాడుతుండడంతో గోదావరి జిల్లాల్లో వాడ వాడలా వయాగ్రా దొరుకుతున్నా చలనం లేదు.

### చూసీచూడనట్టు..

ఉమ్మడి జిల్లా పరిధిలో రాజమండ్రి అర్బన్, రూరల్, కొవ్వూరు, తుని, కాకినాడ రూరల్, అర్బన్, అమలాపురంలలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరికి జిల్లా అధికారిగా ఏడీ ఉంటారు.

### అసలేంటి వయాగ్రా?

వయాగ్రా అనేది తయారీ కంపెనీ పేరు. ఆ మాత్రల్లో 'సిల్డినాఫిల్ సిట్రేట్' అనే మెడిసిన్ ఉంటుంది. అన్ని మందుల మాదిరిగానే దీనినీ మెడికల్ షాపుల్లో విక్రయించవచ్చు. కానీ వైద్యుల ప్రిస్క్రిప్షన్, పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలి. ఈ మెడిసిన్‌ని లైంగిక పటుత్వం, కలయిక సమయం పెరుగుదలకు వాడతారు. పల్మనరీ హైపర్ టెన్షన్‌కి ఒక్కోసారి వైద్యులు సూచిస్తారు. బీపీ ఉన్న వారు ఈ మెడిసిన్ వాడితే నరాలు పగిలిపోయి ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ఈ ట్యాబ్లెట్లు 4.50 సంఖ్యా ప్యాక్‌లో దొరుకుతాయి. వీటిని ఆన్‌లైన్‌లో కూడా విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు.వీటికి ఉమ్మడి జిల్లాలో యువత అలవాటు పడడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది.రాజమండ్రిలో 2017-18లో వయాగ్రాకు సంబంధించి కేసులు పెట్టారు. అవి ఇప్పటికీ నడుస్తున్నాయి.కొన్ని నెలల కిందట దానవాయి పేటలోని ఓ పెద్ద మెడికల్ షాపులో కాలం చెల్లిన మందులు విక్రయించగా ఓ వారం రోజుల పాటు ఆ షాపును మూతవేయించారు. తర్వాత 'ఏ జరిగిందో' ఎవరికీ తెలియదు. ఏదేమైనా చాలామటుకు దుకాణం స్థాయిలోనే సర్దుబాటు అయిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ సీరియస్‌గా దృష్టి సారించాలనే వాదన వినవస్తోంది.

వయాగ్రా అంశం గుప్పుమన్న తర్వాత పొడి పొడిగా తనిఖీలు చేశారు. కానీ ఏం జరిగిందో తెలియరాలేదు.దీనిపై ఉమ్మడి తూర్పు గోదావరి ఔషధ నియంత్రణ శాఖ ఏడీని వివరణ కోరడానికి రెండు రోజులపాటు ప్రయత్నించినా ఫోనులో అందుబాటులోకి రాలేదు. మెడికల్ షాపుల ద్వారా కొంత మొత్తం ముడుతుండడంతో కొందరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మందుల విచ్చలవిడి విక్రయాలపై గత ఏడాది అక్టోబరులో 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా హెచ్చరించింది. మందుల విక్రయాలు ఇష్టానుసారం జరుగుతున్నాయని, వైద్యులు కూడా అనవసరమైన మందులను యథాలాపంగా రాసేస్తున్నారని పేర్కొంది.

### ఎక్కడపడితే అక్కడ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1500 వరకూ మెడికల్ షాపులు ఉన్నాయి. వాటిలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నగరాల్లో 500 ఉండగా.. గ్రామాలు, మండల కేంద్రాల్లో వెయ్యి వరకూ ఉంటాయి. చాలా దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అన్ని మందులనూ అమ్మేస్తుంటారు.నిద్ర మాత్రలు, యాంటి బయోటిక్స్ ఇలా అన్నీ దొరికేస్తుంటాయి. గ్రామాల్లో ఈ విధమైన వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనపుగా ఒక యువకుడు వయాగ్రా, అబార్షన్ కిట్లు, అబార్షన్ ట్యాబెట్ల వ్యాపారాన్ని తెరచాటుగా విస్తరించుకున్నాడు. గ్రామాల్లో అబార్షన్ కిట్లు విచ్చలవిడిగా దొరుకుతుండడంతో ఎలాంటి అనుమతులు, అనుభవం లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు.

## విచ్చలవిడిగా మందుల విక్రయాలు

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఓకే
- అందుబాటులో అబార్షన్ ట్యాబ్లెట్లు
- ఇబ్బడిముబ్బడిగా వయాగ్రా అమ్మకాలు
- దగ్గు మందులకు అడ్డేలేదు
- కొరవడిన డ్రగ్స్ శాఖ నిఘా
- మామ్మూళ్ల మత్తే కారణం

### మందులోళ్ల మాయ?

గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌ని నియమించుకుని వ్యాపారం చేసేవి.అయితే ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. హరియాణాలోని బడ్డి అనే ఓ ప్రాంతంలో, అలాగే గుజరాత్‌లోని పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకు రావడం మొదలైంది.దీనిని ప్రోపగాండా కం డిస్ట్రిబ్యూషన్ (పీసీడీ) అంటారు. ఆ మందులపై సొంతగా పేరు వేయించుకోవచ్చు. సాధారణంగా మందులు తయారీ నుంచి వినియోగదారుడి చేతికొచ్చేసరికి 1500 శాతం ధర పెరుగుతుంది. ఇప్పుడు వయాగ్రా, అబార్షన్ కిట్లను తీసుకొచ్చి దందా సాగిస్తున్నారని తెలుస్తోంది.

### నాడు కలెక్టర్ ఆదేశించినా..

ఉమ్మడి తూర్పులోని డ్రగ్స్ శాఖ పనితీరుకు దగ్గు మందుల అంశం మరో ఉదాహరణ. గంజాయి వంటివి కట్టడి చేసినా యువత మత్తులో జోగుతుండడంపై తూర్పు గోదావరి పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే నిఘా పెట్టగా..దగ్గు మందులను ఎక్కువ మోతాదులో తాగేస్తున్నారని తెలిసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా లభ్యమవుతుండడంపై నివ్వెరపోయారు. మెడికల్ షాపులపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.కానీ తర్వాత ఫలితం ఏమిటో డ్రగ్స్ అధికారులు బయటకు పొక్కనీయలేదు.

### డొంక కదిలిందిలా..

గణేశ్ కుమార్ అనే యువకుడు రాజమహేంద్రవరంలోని ఓ పెద్ద కంపెనీ ఫార్మసీలో కొన్నాళ్లు పనిచేశాడు. ఇదిలా ఉండగా వేరే రాష్ట్రానికి చెందిన వారితో పరిచయం ఏర్పడింది. కొన్ని ఫార్మసీ కంపెనీలు షెడ్యూల్ హెచ్ డ్రగ్స్‌ని అక్రమంగా పెద్ద మొత్తంలో అమ్ముకోడానికి ఉద్యోగులను నియమించుకుంటాయి. ఈ మాదిరిగానే గణేశ్‌కి మార్గం దొరికింది. దీంతో అతడు వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు. కొన్నేళ్లుగా వయాగ్రా ట్యాబ్లెట్లు, గర్భవిచ్ఛిత్తి మందులు, కిట్లు తెచ్చి మెడికల్ షాపులకు విక్రయిస్తున్నాడు. జంగారెడ్డిగూడెంలోని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ఎత్తున ఆ మందులు పట్టుబట్టాయి. అయితే ఉమ్మడి తూర్పుగోదావరిలో కూడా ఆ అక్రమ వ్యాపారం విక్రయించిందని చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకూ డ్రగ్స్ అధికారులు మేలుకోలేదు.

# ఆనందాల బడి!

## జిల్లాలో ఘనంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

రాజమహేంద్రవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ జిల్లాలో ఉత్సాహంగా జరిగింది. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సారి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వేడుకలను నిర్వహించారు. ఆత్మీయ సమావేశం పేరుతో బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ పాఠశాలలకు సాదరంగా స్వాగతం పలికారు. విద్యార్థుల చదువు, నడవడిక, తీరు, ఆరోగ్యం గురించి స్కూలు ఉపాధ్యాయులు వివరించారు. తల్లిదండ్రులు తమ ఆలోచనలను పంచుకున్నారు. ప్రజా ప్రతినిధులు బోధన మెరుగుదల, స్కూలు అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. తొలుతగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మార్షల్ ఆర్ట్స్, విద్యార్థులు,తల్లిదండ్రుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.పాఠశాలలు, కళాశాలల్లో తల్లి పేరుతో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కలెక్టర్‌తో సహా ఉన్నతాధికారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పిల్లలతో మమేకమైపోయారు. సెల్ఫీలు దిగారు. ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. తమ చిన్ననాటి సంగతులను గుర్తు తెచ్చుకున్నారు.ఎదుగుదలకు కారణమైన అంశాలను, విజయాలను అందుకునే మార్గాలను సూచించారు. గోపాలపురం మండలం రాజంపాలెంలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు. గోకవరం మండలం కామరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్పీ పాల్గొన్నారు. వికసిత భారత్ నిర్మాణం పాఠశాల నుంచే ప్రారంభం కావాలని ఎంపీ పురందేశ్వరి అన్నారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం కార్యక్రమానికి హాజరయ్యారు. సంపూర్ణ వికాసానికి ఈ వేడుక చక్కటి వేదికనడంలో సందేహం లేదన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్యాపురం శ్రీ నన్నయ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో వేడుకలకు హాజరై మాట్లాడారు. సెల్ ఫోన్లకు బానిసలుగా మారడం వల్ల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు.గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు.నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రూరల్ టీడీపీ నాయకుడు డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జిల్లాలోని మొత్తం 976 ప్రభుత్వ పాఠశాలలు, 568 ప్రైవేటు పాఠశాలలు, 126 ఇంటర్మీడియట్ కళాశాలల్లో పీటీఎంని నిర్వహించారు. డీఈవో కె.వాసుదేవరావు తదితరులు పర్యవేక్షించారు.



**మీరు పూజనీయులు :** గోకవరం మండలం కామరాజుపేట స్కూల్ హెచ్ఎంకు ఎస్పీ నరసింహకిశోర్ సత్కారం

తాటాకు పాకలో.. గోనె సంచులపై

### కూర్చుని చదువుకున్నాం

**గోకవరం :** నేను చదువుకున్న రోజుల్లో ఇపుడు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల్లో ఇసుమంతైనా ఎక్కడా కానరాలేదు. మారుమూల ప్రాంతంలోని చిన్నపాటి తాటాకు పాకలో గోనె సంచులపై కూర్చుని చదువుకున్నాం. ప్రైవేట్ పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించే ముందు ఉపాధ్యాయులకు ఓ లేఖ రాశారు. తన కుమారుడిని జాగ్రత్తగా చూసుకోవాలని..తన కుమారుడిని సన్మాన మార్గంలో నడిపించాలని కోరారు. అప్పటితో పోల్చుకుంటే మెరుగైన సౌకర్యాలు ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్నాయి. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపైన పూర్తి విశ్వసనీయత కలిగి ఉండాలి. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎస్పీని సన్మానించే ప్రయత్నం చేయగా సున్నితంగా తిరస్కరించి ఆయనే పాఠశాల హెచ్‌ఎం నాగేంద్రకుమార్‌ను సత్కరించారు..

- నరసింహ కిశోర్, ఎస్పీ



**కొవ్వూరు టోల్‌గేట్ వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీఆర్,జనసైనికుల నిరసన**

జనసేనకు ప్రాధాన్యత ఉండడంలేదని..

## టీవీఆర్ నిరసన ప్రదర్శన

కొవ్వూరు,జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత లభించడం లేదని జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీ.వీ.రామారావు ధర్నా చేశారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్ గేటు సెంటర్‌లో గురువారం ఉదయం జనసైనికులు నల్లరిబ్బన్లు ధరించి రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా చేపట్టారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీ.వీ. రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమిలో భాగస్వామ్యమైన టీడీపీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతం నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. కొవ్వూరులో కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. కొవ్వూరు నియోజకవర్గం 14 సొసైటీల్లో జనసేనకు 3 సొసైటీలు ఇవ్వాలని అడిగినా ఎటువంటి సమాచారం లేకుండా సొసైటీలకు త్రిసభ్య కమిటీలు వేసుకోవడం ఎంతవరకు సబబు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎరుబండి సురేష్, పసలపూడి తాతారావు, నామాన చిన్నబూరయ్య, కల్లూరి సుబ్రహ్మణ్యం, ముప్పనపల్లి వీరబాబు, చీకట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి పదవి నుంచి తొలగింపు

పార్టీ విధానాలకు భిన్నంగా వ్యాఖ్యలు చేయడం,కార్యక్రమాలను నిర్వహించడంతో కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పదవి నుంచి టి.వి.రామారావును తొలగిస్తూ జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంటు హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా చర్యలు ఉండడంతో తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. అయితే అంతకుముందు టీవీఆర్ కొవ్వూరులో పరిస్థితులపై సీఎం నారాచంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లకు లేఖ రాసినట్టు సమాచారం.

# స్మార్ట్..మీ డర్!

## వద్దంటున్న వినియోగదారులు



- స్మార్ట్ మీటర్ల గందరగోళం
- ప్రభుత్వ ఆఫీస్, కమర్షియల్ ముందు
- గృహాలకు ప్రభుత్వ అనుమతి లేదు
- బిగించిన వాటికి 2 శాతం అదనపు బిల్లు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వినియోగదారులు స్మార్ట్ మీటర్ల షాక్ కొడతాయని ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్లు వద్దంటూ మొండికేస్తున్నారు. ఈ మీటర్ల మార్పు వివాదాస్పదమైంది. స్మార్ట్ మీటర్లను మార్చుకోవచ్చని చెప్పడానికి ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. అయినా ఇంత వరకూ గృహ వినియోగానికి సంబంధించి స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. స్మార్ట్ మీటర్లపై గత వైసీపీ ప్రభుత్వంలోనే ఆదానీ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చున్న సంగతి తెలిసిందే. ఈ మీటర్లు బిగిస్తే ఎక్కువ బిల్లు వస్తుందని..ఈ విధానంలో రీచార్జి ఆప్షన్ ఉండడం వల్ల బిల్లులు విధానం ఉండదని.. ముందుగా డబ్బు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అవుతుందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో గృహ వినియోగానికి సంబంధించి ఇంత వరకూ స్మార్ట్ మీటర్ల బిగింపు విషయంలో ఏ విధమైన నిర్ణయమూ తీసుకోలేదు. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరీ -2కు చెందిన వాణిజ్య రంగ వినియోగదారులకు మాత్రం తప్పనిసరిగా బిగిస్తున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, వీధిలైట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేస్తున్నారు.జిల్లా లో మొత్తం 10,681 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా ఇప్పటికే 9,860 మీటర్లు బిగించారు. వాణిజ్యానికి సంబంధించిన వినియోగదారులు, 500 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించిన గృహ వినియోగదారులకు బిగించాలని గుర్తించారు. కానీ కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఈ కేటగిరిలో ఒక లక్షా 40 వేల 717 మంది వినియోగదారులను గుర్తించగా ఇప్పటికే 48,115 స్మార్ట్ మీటర్లు బిగించారు. ఇందులో సుమారు 4 వేల మంది వరకూ ఎక్కువ విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులు కూడా ఉన్నట్టు గమనార్హం. కానీ అసలు గృహాలకు మీటర్లు మార్పు విషయంలో ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోక పోయినప్పటికీ.. ఓ జాబితా పట్టుకుని ఆదాని గ్రూపునకు చెందిన ఉద్యోగులు ఇళ్లు, అపార్ట్ మెంట్లకు తిరుగుతుండడం గమనార్హం. అధికారికంగా అయితే విద్యుత్ శాఖకు సంబంధించిన ఉద్యోగి ఆధారాలతో వచ్చేవారని..అయినా స్మార్ట్ మీటర్లు బిగించడానికి తాము ఒప్పుకోమని ప్రజలు తిప్పి పంపుతున్నారు. ప్రస్తుతం బిగించిన ప్రాంతాల్లో కొంత ఎక్కువ బిల్లులు వస్తుండడం గమనార్హం. ఈ మీటర్లు బిగిస్తే 2 శాతం వరకూ పెరగవచ్చని అంచనా. స్మార్ట్ మీటరు మొబైల్ యాప్‌లో లాగిన అయితే ప్రతి అర గంటకూ ఎంత విద్యుత్ వినియోగమైందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చని..దాని వల్ల ఎంత వాడుకోవాలో తెలుసుకునే సౌలభ్యం ఉందని అధికారులు చెబుతున్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించడానికి ఎవరూ ఒప్పుకోవద్దని వామపక్షాలు, ఇతర నాయకులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నారు. ప్రజలు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఈ మీటర్లు మార్చడం అనేది వివాదాస్పదమైంది.

పరిమితి మించిన ఇసుక లోడు..

## 7 లారీలు సీజ్

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో అధిక లోడుతో ఇసుకను తీసుకెళుతున్న 7 లారీలను సీజ్ చేసినట్టు జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. వీటిలో ఆరు లారీలను రంగంపేట పోలీసుస్టేషన్, 1 లారీని కొవ్వూరు టౌన్‌స్టేషన్‌కు తదుపరి చర్యలకు అప్పగించినట్లు తెలిపారు. ఇసుక కార్యకలాపాలు నిర్వహించే ర్యాంపుల్లో అధికలోడు చేసినా, టార్పాలిన్లు కట్టకుండా ఇసుక లారీ బయటకు వచ్చినా ఆయా సొసైటీలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తామని నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. ఇసుక అధిక లోడు కారణంగా రోడ్ల మీద ఇసుక పడి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, రోడ్లు పాడవుతున్నాయని అన్నారు.



## గోదావరికి వరద పోటు

7


తాళ్లరేవులో తల్లుల పాదాలకు మొక్కుతున్న పిల్లలు


అమలాపురంలో తల్లుల దీవెనలు తీసుకుంటున్న పిల్లలు


రాజమహేంద్రవరంలో కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు


సర్పవరంలో తల్లుల పాదాలు కడుగుతున్న విద్యార్థులు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు


అమ్మా నీకే: పిఠాపురంలో తల్లులకు మొక్కలు అందజేత


ఆలమూరులో మెగా పీటీఎం ఆకారంలో విద్యార్థులు


నా అంత ఎదగాలి : గోపాలపురం రాజంపాలెంలో కలెక్టర్ ప్రశాంతితో నడచి వస్తున్న విద్యార్థి

# మెగా పండుగ

## పాఠశాలల్లో ఉత్సాహంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

విద్యాలయాలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి. పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు ఆహ్లాదకర రీతిలో జరిగాయి. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని పాఠశాలల్లో వినూత్నంగా పీటీఎం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోను తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను మెగా ప్రగతిలో భాగస్వాములను చేశారు. కొన్ని చోట్ల విద్యార్థులు తమ తల్లులకు కాళ్లు కడిగి ప్రేమ చాటుకున్నారు. అమ్మ పేరున మొక్కనాటాలన్న ఆదేశాలతో పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి మొక్కలు అందజేశారు.


రాజమండ్రి సెల్ఫీ స్టాండ్ వద్ద డీఎల్ఎస్ సెక్రటరీ శ్రీలక్ష్మికి స్వాగతం


పి.గన్నవరంలో తల్లితో విద్యార్థినుల ఫొటో



రాజమహేంద్రవరం, కరపలో టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తున్న దృశ్యం

# శాకంబరిగా రత్నగిరి దుర్గలు


శాకంబరిగా దర్శనమిస్తున్న వనదుర్గమ్మ


మరిడమ్మ అమ్మవారికి మహిళలు సమర్పించిన సారె

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గ, గ్రామదేవతలు నేరేళ్లమ్మ, మరిడమ్మ, వానవీమాతలు శాకాంబరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. ఈసందర్భంగా అమ్మవార్లను వివిధ రకాలైన కూరగాయలతో అలంకరించారు. శాకాంబరీ అలంకారంలో ఉన్న అమ్మవార్లను భక్తులు, గ్రామస్థులు దర్శించుకున్నారు.

### మరిడమ్మ అమ్మవారికి సారె సమర్పణ

గ్రామదేవతగా పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారికి గురువారం గ్రామంలో వెలంపేట మహిళలు సారెను సమర్పించారు. వివిధ రకాలైన పదార్థాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, కలశాలతో జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో అందజేశారు. అనంతరం వీటిని ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ సభ్యులు పెద్దింటి లక్ష్మణ్, యాళ్ల శ్రీనివాస్, వగ్రే సత్యకుమార్ ఏర్పాట్లు చేశారు.

### లోవలో ఆషాఢ మాసోత్సవాలు

తునిరూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాడ మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన హోమ క్రతువుల్లో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలాచరించారు. పెద్దాపురం నాదస్వర విద్వాంసులు వారిచే నిర్వహించిన నాదస్వర సంగీత కచేరి భక్తులను అలరించింది. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు పండితులు వేద ఆశీర్వచనాలు గావించారు.

# శాకంబరిగా ఆలమూరు రావులమ్మ

## 58 రకాలు.. 550 కిలోల కూరగాయలతో అలంకరణ



ఆలమూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఆలమూరు గ్రామదేవత రావులమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి అమ్మవారిని దర్శించుకున్నారు. రావులమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించడానికి భక్తులు సహకారంతో 58 రకాల కూరగాయలు 550 కిలోలతోపాటు వివిధ రకాల ఆకుకూరలతో అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. శాకాంబరి అమ్మవారిగా రావులమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు వేదుల లక్ష్మణశర్మ అధ్వర్యంలో పెద్దింటి కాశీవిశ్వనాధ శర్మశాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

### నూకాంబిక ఆలయానికి రూ.5.5 లక్షల విరాళం

చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు మండపేటకు చెందిన టీడీపీ నాయకులు వంక సాయికుమార్‌బాబు భారీ విరాళం అందించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గుర్తించి రూ.5.5లక్షల విరాళంను ఆలయకమిటీకి అందించారు. దాత సాయికుమార్‌బాబును అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, గన్ని సూరిబాబు, వైట్ల గంగరాజు, బొబ్బా ఏసు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# గురుపౌర్ణమి.. వేడుకలు


బలభద్రపురంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా, దర్శనానికి బారులుదీరిన భక్తులు

## బలభద్రపురంలో సాయిబాబాకు 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం

బిక్కవోలు, జూలై 10(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని సాయిమందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి బాబా దర్శనానికి భక్తులు బారులు తీరారు. కాకడ హారతితో వేడుకలు ప్రారంభించారు. అనంతరం సాయిబాబాకు 1008 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, శ్రీచక్రానికి లక్ష కుంకుమార్చన, దత్తాత్రేయ హోమం, చండీ మూలమంత్రం, సూర్యనమస్కారాలు, సహస్ర లింగార్చన, సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాబాకు క్షీరాభిషేకం జరిపి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. భక్తులకు బిరియాని ప్రసాదాన్ని అందించామని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు.మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బాబాను దర్శించుకుని పూజలు చేశారు.కార్యక్రమాల్లో కొవ్వూరి పాపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయదుర్గా పీఠంలో గాడ్ ఆశీస్సులు పొందుతున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి

## విజయదుర్గా పీఠంలో గురుపూజోత్సవం

రాయవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాకలోని విజయదుర్గా పీఠంలో బీజేపీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరుగా పీఠాన్ని దర్శించుకున్నారు. గాడ్‌కు ఎమ్మెల్యే పుష్పాలతో పాదపూజ చేయగా ఎంపీ సత్కరించారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే విజయదుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చనలు, హారతులు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పీఠాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యేను పీఠం ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు సత్కరించారు. కార్యక్రమల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కర్రి చిట్టిబాబు, కోన సత్యనారాయణ, చాట్రాతి జానకి, ఎం.శ్రీదేవి, శాకా దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

## సత్యదేవుడి సన్నిధిలో గురువందనం

అన్నవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా గురువందనం కార్యక్రమం టీటీడీ సహకారంతో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ అనంతతీర్థాచార్యులు ఆయన శిష్యబృందం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువుల వద్ద నేర్చుకున్న విద్యను సమాజానికి ఉపయోగపడేలా వ్యవహరించినప్పుడే జ్ఞాన సముపార్జనకు సార్థకత చేకూరుతుందన్నారు.ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో నడవాలని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామికి 3 కిలోల వెండి ఆభరణాలు

ద్రాక్షారామ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి రామచంద్రపురం మండలం హసన్‌బాద మాజీ సర్పంచ్ పచ్చిపాల వీరవెంకట్రావు, వెంకటలక్ష్మీ దంపతులు రూ 3.70 లక్షలు విలువైన 3 కేజీల వెండి ఆభరణాలు బహూకరించారు. వెండి కవచం, కిరీటం తదితర ఆభరణాలు ఆలయ అర్చకులకు అందచేశారు.

# మధ్యవర్తిత్వంతో శాంతియుత పరిష్కారం

## పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంలో శాంతియుత పరిష్కారానికి అవకాశం ఉంటుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం దిశగా 86 మంది న్యాయవాదులకు 40గంటలపాటు తమిళనాడు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమ ప్రారంభించిన ఆమె.. 'దేశం కోసం మధ్యవర్తిత్వం' వారోత్సవాల పోస్టర్‌ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ప్రజలు తమ వివాదాలను శాంతియుతంగా, తక్కువ ఖర్చుతో, త్వరగా పరిష్కరించుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ సమస్యలకు మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వక పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ఇరు పక్షాల నుంచి సామరస్య అంగీకారం తీసుకొని ఆ మేరకు అవార్డు(తీర్పు) జారీ చేయనున్నట్టు చెప్పారు. రాజీ అంటే ఇరు పక్షాలదీ గెలుపేనని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పీఎల్వీలు తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ మల్లయ్యపేట

## దుమ్ము, ధూళి నుంచి రక్షించండి
## ఫ్లెక్సీలతో గ్రామస్థుల వినూత్న నిరసన


మల్లయ్యపేట పేపరుమిల్లు రోడ్డులో కమ్మేసిన దుమ్ము ధూళి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కాలుష్యం నుంచి మల్లయ్యపేటను రక్షించాలని కోరుతూ గ్రామస్తులు వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. కాతేరు గ్రామ పరిధిలోని మల్లయ్యపేటలో పేపరుమిల్లు నార్త్‌గేట్ వైపు నుంచి వస్తున్న ఇసుక లారీలు, మిల్లుకు వచ్చేలారీలతో రోడ్డు మొత్తం దుమ్ముధూళితో నిండిపోయింది. దీంతో వర్షపడినప్పుడు బురదమయమై ద్విచక్ర వాహనాలు జారి పడి ప్రజలు గాయాపాలవుతున్నారు. ఎండ కాసినప్పుడు దుమ్ము మొత్తం గాలిలోకి లేచి రోడ్డు పక్కన ఇళ్లన్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఆహార పదార్థాలపై కూడా దుమ్ముపడి తినడానికి పనికి రాకుండా పోతుందని, అలాగే రోడ్డుపక్కన చిరు వ్యాపారులు తయారు చేసే ఆహార పదార్థాలపై పడి వాటిని విక్రయించే పరిస్థితి లేక పోతుందని వాపోతున్నారు. షాపుల నిండా దుమ్ము చేరడంతో పరిస్థితి దారుణంగా మారిపోయింది. దీనిపై పంచాయతీ అధికారులకు, పేపరు మిల్లు యాజమాన్యానికి చెప్పి చెప్పి విసుగు చెందిన గ్రామస్థులు వారి ఇళ్ల, షాపుల ముందు 'సేవ్ మల్లయ్యపేట అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం సాయంత్రం మల్లయ్యపేటలో రోడ్డుపై నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పేపరుమిల్లు నార్త్ గేట్ రోడ్డు చాలా దారుణంగా మారిపోయిందని, ఆ రోడ్డులో వచ్చే ఇసుక లారీలతో మట్టి వస్తుందని దీనికి ఇసుక తోడై మల్లయ్యపేట రోడ్డు పైకి చేరి మెయిన్ రోడ్డు కాస్తా మట్టి రోడ్డులా మారిపోయిందన్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, స్థానికంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థల బస్సులు, పేపరు మిల్లుకు వచ్చే కర్రల లోడు లారీలు, ఇసుక లారీలతో రోడ్డు దారుణంగా మారిపోయిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ దుమ్ము ధూళి నుంచి బయటక పడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధూళి వల్ల కళ్లు మంటలు, ఊపిరి పీల్చడంతో లోపల మట్టి పట్టి ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.


ముఖానికి మాస్క్ ధరించి ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు


షాపుల వద్ద 'సేవ మల్లయ్యపేట' ఫ్లెక్సీలు పెట్టిన వ్యాపారస్తులు

# రామాలయం పునః నిర్మాణానికి ఒప్పందం

## బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్, సినీ నటి కరాటే కళ్యాణి


షాపు యజమానితో మాట్లాడుతున్న కళ్యాణి

సీతానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని స్వీట్ స్టాల్ నిర్వాహకులతో రామాలయ పునః నిర్మాణానికి ఒప్పందం జరిగిందని శ్రీ ఆదిబట్ల కళా పీఠ వ్యవస్థాపక అధ్యక్షురాలు, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ మహిళా అధ్యక్షురా లు, బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్, సినీ నటి కరాటే కళ్యాణి తెలిపారు. గురువారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని రామాలయాన్ని స్వీట్ స్టాల్‌ను కళా పీఠం జిల్లా అధ్యక్షురాలు పోతుల సుబ్బలక్ష్మి సందర్శించారు. రామాలయం మండపం కూల్చి స్వీట్‌స్టాల్ పెట్టారని, షాపు యజమాని క్రిస్టియన్ అని ఫిర్యాదులు రావడంతో కరాటే కళ్యాణి పరిశీలించడానికి వచ్చారు. రామాలయం నిర్వాహకులను పిలిచి ఆరా తీశారు. పూర్వకాలం నుంచి ఆలయ నిర్వహణ తామే చూస్తున్నామని, మూడేళ్ల క్రితం మండపం కూలిపోయే దశకు చేరుకోవడంతో దానిని కూల్చివేశామని తెలిపారు. గుడి ఎక్కడ కట్టినా ఆర్థిక సహాయం చేస్తామని చెప్పడంతో ఖాళీగా ఉన్న మండపం స్థానంలో స్వీట్‌స్టాల్ కట్టుకోవడానికి సరే ఒప్పుకున్నామన్నారు. కళ్యాణి సమక్షంలో రెడ్డి కుటుంబానికి హిందూ ధర్మం స్వీకరింపజేశారు. (ఘర్‌వాపసి) ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆలయం కట్టే సమయంలో రాతి విగ్రహాలు ఏర్పాటుచేసి, ఆలయ నిర్మాణానికి షాపు యజమాని ఒప్పుకోవడంతో స్వీట్‌స్టాల్ ఉంచడానికి అనుమతి ఇచ్చామన్నా రు. ఆరు నెలల్లో ఆలయ నిర్మాణం జరగాలన్నా రు. కాగా జనసేన వీరమహిళ సూర్యావతి మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులకు గుడిలో జరిగే కార్యక్రమాలపైనే అజమాయిషీ గాని గుడిని అమ్ముకోవడానికి గాని గుడిని కూలగొట్టడానికి గాని అధికారం లేదన్నారు. దీనిపై పోరాటం చేసి ఆలయాన్ని పరిరక్షిస్తామని ఆమె అన్నారు.


పురస్కారం అందుకుంటున్న సుగుణారెడ్డి

## ఆదిత్య డైరెక్టర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం

కాకినాడ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్, రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా వైస్‌చైర్మన్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా రెడ్‌క్రాస్ పురస్కారాన్ని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. 2022, 23, 24 సంవత్సరాలకు గానూ ప్రథమస్థానం పురస్కారాన్ని గవర్నర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ రెడ్‌క్రాస్‌ను ప్రథమ స్థానంలో నిలిపినందుకు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. సుగుణారెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

# రహదారిని ముంచేసిన వరద!

- కోనసీమను తాకిన గోదావరి నీరు
- గంటిపెదపూడి బూరుగులంకలో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- నాలుగు లంక గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఇంజన్ పడవలపై ప్రయాణాలు


గంటిపెదపూడి శివారు బూరుగులంక వద్ద పడవలో వెళ్తున్న లంక గ్రామస్తులు


గంటిపెదపూడిలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి

పి.గన్నవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎగువన వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరికి వరద నీరు ప్రవాహం నెమ్మదిగా పెరుగుతుంది. ఈ క్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి, ఉడిమూడికి చెందిన నాలుగు లంకగ్రామాల ప్రజానీకం రాకపోకలు సాగించేందుకు బూరుగు లంక నదీపాయలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం తెల్లవారుజామున వరద నీటిలో కొట్టుకుపోయింది. వరదనీరు గట్టును తాకిన అరగంటలోనే గట్టు వరద ప్రవాహంలో పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గంటిపెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడి శివారు ఊడిమూడిలంక గ్రామాల ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఇంజన్ పడవలపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు దగ్గర నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తరలించే రైతులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి లంక గ్రామాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు వైవిపాలెం, బెల్లంపూడి వద్ద నదీపాయల్లోకి వరద నీరు రావడంతో ఆ గ్రామాల ప్రజలు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.


అయినవిల్లి: ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో రహదారికి గండి పడడంతో ఆగిపోయిన ప్రయాణికులు

### రహదారికి గండి

అయినవిల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరద తాకిడితో కోనసీమ జిల్లా ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో తాత్కాలిక రహదారి గండి పడింది. కార్లు, ఆటోల ప్రయాణాలు నిలిచిపోయాయి.

### లైఫ్‌జాకెట్లు ధరించడం తప్పనిసరి : ఆర్డీవో

లంకగ్రామస్తులు నదీపాయ దాటే సమయంలో తప్పనిసరిగా లైఫ్‌జాకెట్లు ధరించాలని ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. లైఫ్‌జాకెట్లు ధరించనివారిని దాటించవద్దని హెచ్చరించారు. పడవపై పదిమందిని మాత్రమే దాటించాలన్నారు. ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. ప్రస్తుతం 2 ఇంజన్ పడవలు తిరుగుతున్నాయని, వాటిలో లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. లంక గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థుల వరకు బయట పాఠశాలల్లో చదువుకుంటున్నారని రోజూ పడవలు దాటే వారికి ప్రత్యేక లైఫ్‌జాకెట్లు ఏర్పాటు చేశామన్నారు. నదీపాయకు ఇరువైపులా రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ టీ.సాయినాథ్ జయచంద్ర గాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి నాలుగు లంక గ్రామాల్లో పర్యటించారు.

# 'ముంపు' టెన్షన్

- భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతోన్న గోదావరి
- లోతట్టు ప్రాంతాల ప్రజల్లో ఆందోళన ప్రారంభం
- వలస పాకల ఏర్పాట్లలో నిమగ్నం

చింతూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరదల కాలం వచ్చింది. దీంతో ముంపు ప్రాంతాల్లో టెన్షన్ ప్రారంభమైంది. నదీ పరివాహక ప్రాంతంలో ఎడతెరిపి లేని వర్షం కురవగా అక్కడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవడం సహజం. ఐతే విలీన మండలాల పరిస్థితి అందుకు భిన్నం. మన రాష్ట్రంతో పాటు ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినా, వరదలు సంభవించినా ఆ ప్రభావం ఇక్కడ పడుతుంది. ఇది ప్రతి ఏటా జరిగే తంతే. వీటికి తోడు ఇప్పుడు పోలవరం బ్యాక్ వాటర్ తోడైంది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు లోతట్టు వాసులకు కంటిమీద కునుకు కరువే. శబరి, సీలేరు, గోదావరి నదుల ఉధృతే దీనంతటకీ కారణం. ప్రతి ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఇది తప్పని దుస్థితి. కొన్నేళ్లుగా జూలై లోనే గోదావరి ఉగ్రరూపం దాల్చిన సందర్భాలున్నాయి. దీంతో ఈనెల ఎట్టా ఉంటుందోనన్న ఆందోళన అలముకుంది. ఇప్పటికే భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం 3 గంటలకు భద్రాచలంలో 24.10 అడుగులకు గోదావరి చేరుకుంది. గతేడాది జూలై 27న భద్రాచలం వద్ద గోదావరి 53.6 అడుగుల గరిష్ఠ ప్రవాహం నమోదైంది. దీంతో లోతట్టు గ్రామాలు నీట మునగడమే కాకుండా రాకపోకలు నిలిచిపోయాయి.


వరరామచంద్రపురంలో లోతట్టు ప్రాంత వాసులు ఏర్పాటు చేసుకుంటున్న వలస పాకలు

### ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం..

గడచిన ఆరున్నర దశాబ్దాల కాలంలో జూలై నెలలో గోదావరి వరద ఉధృతిని పరిగణలోకి తీసుకుంటే 14 సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. అదే దశలో ఆరు పర్యాయాలు తుది ప్రమాద హెచ్చరిక (53 అడుగులు) దాటి ప్రవహించింది. వరుసగా 1972 జూలై 6న 44.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 24న 56.7, 2003 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 47, 2016 జూలై 12న 52.4, 2022 జూలై 16న 71.3 అడుగులు, 2023 జూలై 30న 56.1, 2024 జూలై 27న 53.6 అడుగులకు చేరుకుని ప్రవహించింది. వీటిలో 2022 జూలై 16న రికార్డుస్థాయిలో 71.3 అడుగుల మేర గోదావరి ప్రవాహం నమోదైంది. దీంతో చింతూరు డివిజనులోని లోతట్టు గ్రామాలు ఛిద్రమయ్యాయి. ఇళ్లు కూలిపోయి బురదలో కూరుకుపోయాయి. ఇక రహదారులు సరేసరి. భద్రాచలంలో గోదావరి నది 59 అడుగుల నుంచి 63 అడుగుల వరకు ప్రవహించిన క్రమంలో చింతూరు డివిజనులోని 180 గ్రామాలపై ఆ ప్రభావం పడనుంది. ఆపై ప్రవాహం ఉంటే మునక మరింత పెరుగుతూ ఉంటుంది.

### సమీక్షలు...

ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఒక పర్యాయం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ మండలాల వారీగా వరద సమీక్షలు నిర్వహించారు. ఆ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలు, అధికారులకు స్పష్టం చేశారు. భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతుండడం, రానున్న రెండు రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో లోతట్టు వాసులు సురక్షిత ప్రాంతాలలో వలస పాకల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అదే దశలో సామగ్రిని కూడా సురక్షిత ప్రదేశాలలో భద్రపర్చుకుంటున్నారు.

## సత్యనారాయణకు హ్యాండ్‌లూమ్స్ వేడుకల్లో పాల్గొనే అవకాశం


సత్యనారాయణ

ముమ్మిడివరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆగస్టు 7న జరిగే నేషనల్ హ్యాండ్‌లూమ్స్ డే సెలబ్రేషన్స్ వేడుకల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గేదెలలంక చెందిన చేనేత కార్మికుడు పచ్చినీలం వీరవెంకటసత్యనారాయణకు అవకాశం దక్కింది. ఈ మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ నుంచి సత్యనారాయణకు వర్తమానం అందింది. ప్రధాని మోదీ పాల్గొనే హ్యాండ్‌లూమ్ సెలబ్రేషన్స్‌లో పాల్గొనే అవకాశం సత్యనారాయణకు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతేడాది ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొనే అవకాశం సత్యనారాయణకు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యూఢిల్లీ, ముంబై, కలకత్తా రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన చేనేత ఎగ్జిబిషన్‌లో సత్యనారాయణ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుంటాడు. సత్యనారాయణ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అనేకమంది పేద చేనేత కార్మికులకు పలు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నాడు. ఎన్‌హెచ్‌డీపీ ద్వారా పేదలకు వర్కుషెడ్ల నిర్మాణం, ముద్ర రుణాలు, చేనేత మగ్గాలు వంటివి సమకూర్చాడు. 27మందికి ఒక్కొక్కరికీ రూ.లక్షా 20వేలు వంతున ఉచితంగా షెడ్ల నిర్మాణం, 30మందికి 25శాతం రాయితీపై ముద్ర లోన్లు, 30శాతం రాయితీపై 35మందికి మగ్గాల కొనుగోలుకు ఒక్కొక్కరికీ రూ.30వేలు వంతున అందించాడు. సత్యనారాయణ చేస్తున్న సేవా కార్యక్రమాలు, చేనేత ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాట్లు చేయడంలో ఉత్సాహం ప్రదర్శించడంతో ఈ అవకాశం దక్కింది.

## ఇద్దరు బాలికల మిస్సింగ్‌పై కేసు


నల్లా లతాశ్రీ


నల్లా సత్యవతి

రావులపాలెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలు ఇంట్లో చెప్పకుండా కనిపించకుండా వెళ్లిపోయిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన నల్లా లతాశ్రీ (17), నల్లా సత్యవతి (14) ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు వారి ఆచూకీ కోసం గాలించిన లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్స్ రాగిదిమ్మల చోరీలు... దొరికిన అంతర్ జిల్లా దొంగలు

- ముఠా సభ్యులను దేవరపల్లిలో పట్టుకున్న పోలీసులు
- రూ.10 లక్షల విలువైన 67 రాగిదిమ్మలు, 2 కార్లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగిదిమ్మలు

దేవరపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగిదిమ్మలు దొంగిలించిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని రాగి వైర్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ, కొవ్వూరు ఎస్‌డీపీవో, రాజమహేంద్రవరం సీసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఆ టీమ్‌లు సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల సహకారంతో నలుగురు అంతర్ జిల్లాల దొంగలను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద గురువారం అరెస్టు చేసినట్టు తెలిపారు. వారితో పాటు రాగివైరు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యాపారులను కూడా అరెస్టు చేసినట్టు చెప్పారు. వారు తూర్పుగోదావరి, ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, కోనసీమ జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగిలించారని, వాటి విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. చోరీలకు పాల్పడిన పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం రాయికుదురు గ్రామానికి చెందిన కడలి సతీష్, ఏలూరు జిల్లా కృతివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేండ్రపు దుర్గాశ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన బళ్లా విజయరత్నం, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాల దిబ్బ గ్రామానికి చెందిన ఏలూరు పోసియ్యలతో పాటు పాటు చోరీ సొత్తు కొన్న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవాని దిబ్బ గ్రామానికి చెందిన పావురాయిల కోటేశ్వరరావు, భీమవరం మండలం దిర్శిమర్రు గ్రామానికి చెందిన నవరపు భీమారావును అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన 67రాగిదిమ్మలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. వీటితో పాటు 2 కార్లు, 2 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు గతంలో వివిధ పోలీస్‌స్టేషన్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నేరాలపై అరెస్ట్ అయ్యి బెయిల్‌పై ఉన్నారని తెలిపారు. కేసును ఛేదించిన దేవరపల్లి సీఐ బీఎన్‌నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, రాజమండ్రి సీసీఎస్ సీఐ శ్రీధర్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో దేవరపల్లి విద్యుత్ ఏఈ సీ.వెంకట్రావు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రాజోలు ఆర్ఐ


పట్టుబడిన ఆర్ఐ రాంబాబు

రాజోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ రాజోలు ఆర్ఐ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన గుబ్బల కృష్ణతులసి భర్త అగ్నిమాపక అధికారిగా పనిచేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 27 మరణించారు. కృష్ణతులసి ఈనెల4న తన పేరున ఎలాంటి ఆస్తులు లేనట్టు నో ప్రాపర్టీ సర్టిఫికెట్, ఎలాంటి సంపద లేనట్టు నో ఎర్నింగ్ నంబరు సర్టిఫికెట్ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సిందిగా కోరుతూ రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంది. దరఖాస్తుపై విచారణ రిపోర్టును తహశీల్దార్‌కు పంపడానికి రాజోలు ఆర్ఐ కె.రాంబాబు రూ.20వేలు డిమాండ్ చేశాడు. కృష్ణతులసికి ఆ లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులకు ఆర్ఐపై ఫిర్యాదు చేసింది. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రాజోలు ఆర్ఐ రాంబాబు లంచం రూ.20వేలను తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఆర్ఐను శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్లు ఎన్వీ భాస్కరరావు, వైసతీష్‌కుమార్, డి.వాసుకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడలో 320 గ్రాముల బంగారం చోరీ


పగులగొట్టి ఉన్న బీరువా లాకర్

కాకినాడ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సుమారు 320 గ్రాముల బంగారం చోరీ అయినట్టు టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. కాకినాడ ప్రతాప్‌నగర్ ట్రెజరీ కాలనీకి చెందిన భూపతి శ్రీదేవి గత కొన్ని రోజులుగా ఇంటికి తాళం వేసి నాగపూర్ వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తలుపులు బద్దలు గొట్టి తెరిచి ఉండడాన్ని పై పోర్షన్‌లో ఉంటున్న ఆమె బంధువులు గమనించి శ్రీదేవికి సమాచారం అందించారు. దాంతో ఆమె తన బంధువులతో లోపలికి వెళ్లి పరిశీలించమని కోరింది. ఈ క్రమంలో సుమారు 320 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అవ్వడంతో పాటు రూ.15 వేలు నగదు, మరికొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్టు బంధువుల ద్వారా ఆమె తెలుసుకుంది. ఆమె బంధువులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ ప్రారంభించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించాయి.

## ఆదియోగి విగ్రహం పాక్షికంగా ధ్వంసం

- సామర్లకోటలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు


విగ్రహం ముక్కు భాగాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

సామర్లకోట, జూలై10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి పుష్కరిణి సమీపాన భీమేశ్వరాలయం రోడ్డు వద్ద విశేష పూజలందుకుంటున్న ఆదియోగి శిలా విగ్రహం ముక్కు భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం ఆ దారిన వెళ్లే భక్తులు చూసి స్థానికులకు సమాచారం అందించారు. భీమేశ్వరాలయ కమిటీ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ ఆదియోగి విగ్రహాన్ని పరిశీలించారు. ఇటీవలే కార్తీకమాసంలో విగ్రహాన్ని కాశీ పుణ్యక్షేత్రం నుంచి తీసుకువచ్చి ఎమ్మెల్యే చినరాజప్ప చేతులమీదుగా ప్రతిష్ఠించిన విషయం విధితమే. ఎమ్మెల్యే చిన రాజప్పకు సమాచారం అందివ్వగా పోలీసు లకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా విగ్రహ ధ్వంసం చర్యలకు పాల్పడినవారిని గుర్తించి అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.


రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

## పెరుగుతోన్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రానికి గోదావరి నీటి మట్టం 10.30 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ 175గేట్లను మరింత పైకి ఎత్తి 0.60 మీటర్ల వద్ద ఉంచి 2,65,105 క్యూసెక్కులను దిగువకు వదిలివేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో అన్ని చోట్ల నీటి మట్టం పెరుగుతుంది. శుక్రవారం సాయంత్రానికి సుమారు 5 లక్షల క్యూసెక్కుల ప్రభావం, శనివారం నాటికి 9 లక్షల క్యూసెక్కులు వరద ప్రవాహం ధవళేశ్వరానికి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటి మట్టం 24.50 అడుగులకు చేరుకుంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టాలకు 13750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో పోలవరం ప్రాజెక్ట్ ఉద్యోగి మృతి

సీతానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో అద్దె ఇంటిలో ఉంటూ పోలవరం ప్రాజెక్ట్‌లో ఉద్యోగం చేస్తున్న అంకిత్ కటియార్(34) విద్యుదాఘాతంతో మృతి చెందినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో ఫీల్డ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్ ఉదయం 8గంటలకు ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న తన భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. 9 గంటల నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయక పోవడంతో ప్రాజెక్ట్‌లో ఉద్యోగం చేస్తున్న హెచ్‌ఆర్‌కు ఫోన్ చేసి తెలియపరచగా సహ ఉద్యోగి విశాఖ పట్నానికి చెందిన తాతనపాత్రుని గిరిబాబు వచ్చి చూడగా చేతిలో చిన్నఫ్యాన్‌తో కటియార్ నిర్జీవంగా ఉన్నాడు. దీంతో అతడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్టు గుర్తించారు. మృత దేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గిరిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరప, జూలై 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందినట్టు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ సూరిబాబు తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం మట్లపాలెనికి చెందిన వనమాడి మహేష్(24) కాకినాడ పోర్టులో పనిచేస్తున్నాడు. ఈనెల 8న ఇంటి నుంచి డ్యూటీకి బైక్‌పై బయలుదేరి కరప మండలం ఉప్పలంక వంతెన దిగుతూ అదుపుతప్పి కిందపడడంతో గాయపడ్డాడు. కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు.


## మా కుటుంబంపై అసత్యప్రచారాన్ని ఆపండి


### లేకపోతే ఎదురుదాడికి దిగుతాం : జక్కంపూడి గణేష్

కాకినాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబంపై జనసేన నేతలు సోషల్‌మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని లేకపోతే ఎదురుదాడికి దిగుతామని వైసీపీ యువజన విభాగం ప్రాంతీయ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేశ్ అన్నారు. తన తండ్రి దివంగత రామ్మోహనరావు, అన్న రాజా, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు ముందు వారి పార్టీ గురించి, నాయుల పరిస్థితి తెలుసుకోవాలని హితవు పలికారు. గురువారం కాకినాడలోని ఆయన బంధువుల ఇంట్లో మీడియాతో మాట్లాడారు. తమ కుటుంబంపై జనసేన నేతలు బెట్టింగ్ మాఫియా, భూ కబ్జాలు, పేకాట క్లబ్బులు నిర్వహిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిలో ఆధారాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీలు మారతామంటూ దుష్ప్రచారం చేస్తున్న కూటమి నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. తాము ఎప్పటికీ వైసీపీలోనే ఉంటామన్నారు. తమ కుటుంబాన్ని విమర్శించిన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీలు వారి పనితీరులో దిగజారిపోయారన్నారు. కూటమి ఎప్పుడు బద్దలవుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఆ పార్టీ నేతలున్నారన్నారు.









## గోదారి ఉరకలు.. అందాల వెలుగులు

ఒకవైపు గోదావరి ఉరకలు వేస్తుంటే మెల్లగా వచ్చాడు సూరీడు. తన వెలుగును కాస్త గోదావరిపై ప్రసరింపచేసి మరింత అందంగా మార్చివేశాడు. అల్లూరి జిల్లా కూనవరం మండలం శబరి, గోదావరి సంగమం వద్ద గురువారం సాయంత్రం వేళ కనిపించిన ఈ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా వడిసిపట్టింది. - కూనవరం (ఆంధ్రజ్యోతి)

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- పాఠశాలల్లో ఘనంగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు,
- విద్యార్థులతో పాదపూజ
- ముఖ్యఅతిథులు సహా అందరికీ రుచికరమైన భోజనాలు


రాజమహేంద్రవరంలో బాలికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసి బడి వైపు అడుగులు వేయిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రకాష్ నగర్‌లోని సుంకర భాస్కరరావు మున్సిపల్ స్కూల్, చున్నీలాల్ జాజు మున్సిపల్ స్కూల్, టౌన్ హైస్కూల్, లాలాచెరువు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నగర్‌లోని మున్సిపల్ స్కూల్లో విద్యార్థులతో ఎమ్మెల్యే మొక్కలు నాటించారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల మధ్య బలమైన బంధాన్ని ఏర్పరచి విద్యార్థుల విద్యాప్రగతికి పాఠశాలల అభివృద్ధికి ఉమ్మడిగా కృషి చేయడమే పేరెంట్స్ టీచర్స్ సమావేశాల ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. అనంతరం స్థానిక మునిసిపల్ కాలనీలోని బీఈఎం స్కూల్లో భవాని చారిటబుల్ ట్రస్ట్, పరమేష్ బయోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే వాసు ప్రారంభించారు. అలాగే నగరంలోని సంజీవ్ నగర్ మోడల్ ప్రైమరీ పాఠశాలలోను, డీఎంహెచ్ స్కూల్, కంటిపూడి రామారావు మున్సిపల్ స్కూళ్లలో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు జరిగాయి. నెహ్రూ నగర్ మునిసిపల్ స్కూల్లో లో జరిగిన సమావేశానికి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి, మరుకుర్తి రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి అధిక ప్రాధాన్యం : బత్తుల

రాజానగరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పేరెంట్స్ టీచర్స్ సమావేశాలతో గురువారం నూతన శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా రాజానగరం హైస్కూల్లో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆర్డీవో కృష్ణనాయక్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందన్నారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫారాలు, బెల్టు, షూలు అందజేస్తోందన్నారు. రాజానగరం మండలంలో 17 హైస్కూల్స్, 7 యూపీ, 37 ప్రైమరీ పాఠశాలలతోపాటు మరో 60 ప్రైవేటు పాఠశాలల్లోనూ పేరెంట్స్ టీచర్స్ సమావేశాలతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, ఎంపీడీవో జే.ఏ ఝాన్సీ, ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ ప్రక్షాళన : నల్లమిల్లి

అనపర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యా వ్యవస్థ బాగున్నపుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లుల కాళ్ల కడిగి పాదపూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి, డీఎల్‌పీవో నాగలత, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అలాగే బాలికోన్నత పాఠశాలలో హెచ్ ఎం కర్రి కళ్యాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలు, మూడు యూపీ స్కూల్స్ రెండు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, 31 ప్రైమరీ పాఠశాలలు, 17 ప్రైవేటు పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**బిక్కవోలు:** మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల్లోను, 13 ప్రైవేటు విద్యా సంస్థల్లోను మెగా పీటీఎం 2.0లను గురువారం ఘనంగా నిర్వహించారని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. కాపవరం ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ రవిబాబు ఏర్పాటు చేసిన ఫొటో బూత్ ఆకట్టుకుంది. మెగా పీటీఎం 2.0 సందర్భంగా భారత వ్యోమగామి ప్రస్తుతం అంతరిక్షంలో పరిశోధనలు చేస్తున్న శుభాంశు శుక్లాతో అంతరిక్షంలో ఫొటోలు తీసుకుంటున్నట్టు ఫొటో బూత్ ఏర్పాటు చేశారు. దీంతో సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులు తమ విద్యార్థుల నుంచి ఫొటోలు తీసుకున్నారు. హెచ్‌ఎం పి.గోపాలకృష్ణారావు టీచర్ రవిబాబును అభినందించారు. పందలపాక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ తేతలి సుమ, ప్రత్యేకాధికారిణి సీహెచ్ లక్ష్మి, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కడియం:** కడియంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్ విచ్చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి నాని, ప్రత్యేకాధికారి ఎన్.మల్లికార్జునరావు, హెచ్‌ఎం టి.సత్యనారాయణ, పాల్గొన్నారు. వేమగిరిలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు విచ్చేసి 35 మంది విద్యార్థులకు నగదు పారితోషికాన్ని అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు.జేగురుపాడులో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థి తేలి వరప్రసాద్‌కు నగదు బహుమతిని అందజేశారు. మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అన్నందేవుల చంటిని సత్కరించారు. పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించడంలో చంటి కృషి చేశారన్నారు.

**రాజమహేంద్రవరం రూరల్:** మండలంలోని శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.భవ్య, డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా కృషిచేస్తానని కిరణ్ హామీ ఇచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య వారధిలా ఉంటుందని, విద్యార్థుల అభ్యాస ప్రగతిని తల్లిదండ్రులకు చేరవేసేలా అవగాహన పెంచేందుకు దోహదపడుతుందని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో తులసీదాస్, పాఠశాల కమిటీ చైర్మన్ జి.వెంకటకృష్ణ ఎలుగుబంటి దుర్గారావు, స్టాఫ్ కార్యదర్శి డి.రాముడు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు.

**ధవళేశ్వరం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. రవిరామ్‌కిరణ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని, మెరుగైన విద్యను అందించడానికి, మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందన్నారు. డీఎస్పీ భవ్య కిషోర్ మాట్లాడుతూ విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ మెగా పీఏం విట్‌నెస్‌గా యర్రమోతు ధర్మరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామపెద్దలు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని వివిధ పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు.

**కోరుకొండ:** కోరుకొండ జూనియర్ కాలేజీలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్, జనసేన మండల కన్వీనర్ అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, ముక్కా రాంబాబు, కర్రి దొరబాబు, యర్రంశెట్టి పోలారావు, దేవన ఎంఈవో టి.కుశలవదొర, తహశీల్దార్ సుస్వాగతం పాల్గొన్నారు.


శాటిలైట్‌సిటీ: సమావేశంలో మాట్లాడుతున్న రవిరామ్‌కిరణ్

**గోకవరం:** మండలంలోని అన్ని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.కామరాజుపేట జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి ఎస్పీ నరసింహ కిషోర్ విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి భోజనాలు చేశారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అడపా భరత్‌కుమార్, డీఎస్పీ శ్రీకాంత్,సీఐ సత్యకిషోర్, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు


రాజానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల


అనపర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి


ధవళేశ్వరం: ఓ పాఠశాలలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న తల్లులు


గోకవరంలో సమావేశానికి విచ్చేసిన ఎస్పీ నరసింహకిషోర్

# గురుపౌర్ణమి వేడుకలు

### భక్తులతో పోటెత్తిన బాబా ఆలయాలు.. ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు


బూరుగుపూడిలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

రాజానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను బాబా ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా రాజానగరంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నిత్యహారతులతో పాటు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. తూర్పుగోనగూడెం, పల్లకడియం, చక్రద్వారబంధం, తోకాడ, రాధేయపాలెం తదితర గ్రామాల్లోని బాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తుల సాయి నామనామ స్మరణలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. దీనిలో భాగంగా భక్తులు గురుచరిత్ర, విష్ణు సహస్రనామ పారాయణం, సాయి చాలీసా ఆలపించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

**రాజమహేంద్రవరం కల్చరల్:** స్థానిక శ్రీరామకృష్ణ మఠంలో గురుపౌర్ణమి ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా మంగళ హారతి, వేద పఠనం, భజనలు, హోమం నిర్వహించారు. తదుపరి స్వామి శశికాంతానందజీ మహరాజ్,స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ గురుపౌర్ణమి విశిష్ఠతను వివరించారు. కార్యక్రమంలో స్వామి సేవ్యానందజీ మహరాజ్, స్వామి ప్రజ్ఞానాధానందజీ మహరాజ్,స్వామి లోకమయానందజీ మహరాజ్, బ్రహ్మచారి ఇష్టచైతన్య మహరాజ్, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక తిలక్‌రోడ్‌లోని షిర్డి సాయిరామ మందిరంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. పుష్కరాలరేవు శ్రీ గోడాడ గోసాయి మఠంలో బ్రహ్మశ్రీ బొండాడ దుర్గాప్రసాద్ సిద్ధాంతి ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు చేశారు. భారీ అన్నదానం జరిగింది. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, దేవదాయ శాఖ ఈవో కృష్ణశ్రీదేవి, వాకచర్ల కృష్ణ, అల్లంకి సత్యనారాయణ, రవి, త్రిమూర్తులు పాల్గొన్నారు. స్థానిక కోటిలింగాల ఘాట్‌లో సూరపురెడ్డి తాతారావు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో యోగా సభ్యులు గీసాల బాపూజీ, రొక్కం గోపి, పెద సత్తిబాబు, ఈశ్వరి, కల్యాణి, వరలక్ష్మి పాల్గొన్నారు. స్థానిక వెంకటేశ్వర నగర్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగం, ధ్యానం, భజన జరిపారు. ముఖ్యఅతిథులు పీవీఎస్ కృష్ణారావు, ఎన్‌వీ శ్రీనివాసరావు, పి.సరోజ, మహేష్.. గురువులను సత్కరించారు. కార్యక్రమంలో దేవిప్రసాద్, రమణ, వెంకటేశ్వరరావు, ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.

**కడియం:** మండలంలోని కడియం, వేమగిరి, వీరవరం, దుళ్ళ కడియపులంక హరిహర మహాక్షేత్రం, జేగురుపాడు, ఎంఆర్ పాలెం, మురమండ సాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఉదయం నుంచి బాబాకు హారతులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద సామూహిక సత్యసాయి వ్రతాలు జరిపారు. కడియపులంక అనంతేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సాయి ఆలయం వద్ద అన్నసమారాధన చేపట్టారు. వేమగిరిలో బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు మహోదయ యాజరాను బీజేపీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో బొర్సు సుబ్రహ్మణ్యం, నాగులపల్లి వీరబాబు, గారపాటి తాతబ్బాయి, చిక్కాల శ్రీను, నాగులపల్లి వీరబాబు పాల్గొన్నారు.

**కోరుకొండ:** మండలంలోని కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి, బూరుగుపూడి ద్వారకా షిర్డీ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బూరుగుపూడిలో ఆశ్రమ గురుదేవులు మామిడిపల్లి రామారావును శిష్యబృందం పాదపూజ చేసి గురుపూజోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు రామారావును పూజించి ఆశీస్సులు అందుకున్నారు. కోరుకొండ నరసన్న దేవస్థానం వద్ద భక్తులు గిరిప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగకేశవరావు, డాక్టర్ పెద్దంటి విద్యాసాగర్, మారిశెట్టి విష్ణుమూర్తి, మధురపూడి విమానాశ్రయం ఏపీడీ శ్రీకాంత్, పప్పాక వెంకటేశ్వరరావు, భూపతి, బోడపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**రాజమహేంద్రవరం అర్బన్:** స్థానిక గౌతమి ఘాట్ సమీపంలోని ఇస్కాన్ టెంపుల్‌లో గురుపూర్ణిమ పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి పాల్గొన్నారు. ఎంపీతోపాటు సత్యగోపీనాథ్‌దాస్, హేమంత్ ప్రభును సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, హీరాచంద్‌జైన్, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, వీరా వీరాంజనేయులు, లలిత్‌కుమార్‌జైన్ పాల్గొన్నారు.

**అనపర్తి:** ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పొలమూరు దత్తనాగసాయి ఆనందాశ్రమంలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనందాశ్రమం వ్యవస్థాపకుడు సత్తి దేవదానరెడ్డి ఆధ్వర్యంలో వేద గురువులకు ఎమ్మెల్సీ పాద పూజ చేసి ఆశీస్సులు పొంది వారిని సత్కరించారు. అదే విధంగా అనపర్తిలోని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రెడ్డి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. అనపర్తి శేషగిరిరావు నగర్‌లోని సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకించి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

### మాజీ కౌన్సిలర్
## అల్లు రాజేశ్వరి మృతి


రాజేశ్వరి(ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10(ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రవరం పురపాలక సం ఘం మాజీ కౌన్సిలర్ అల్లు రాజేశ్వరి హైదారబాద్‌లో బుధవారం కన్నుమూసారు. అల్లు వీరఅప్పారావు భార్య రాజేశ్వరి. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అల్లు బాబి జిల్లా గ్రంథాలయం సంస్థ అధ్యక్షుడిగా పనిచేశారు. రెండో కుమారుడు ప్రసాద్ హైదరాబాద్‌లో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ ధర్మకర్తగా ఉన్నారు. రాజేశ్వరి కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్రవహించారు. 1987లో కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. చాలా కాలం కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. రాజేశ్వరి మృతి పట్ల రాజమండ్రి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సంతాపం ప్రకటించింది. గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలో రాజేశ్వరి అంత్యక్రియలు జరిగాయి.

## ఘనంగా వ్యాసపూర్ణిమ

దివాన్‌చెరువు జూలై10 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం నామవరంలోని భారతీయ విద్యా భవన్స్‌లో గురువారం వ్యాసపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు ఓరియంటల్ కళాశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోవర్ధనం శ్రీనివాసమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు భారతీయ విద్యాభవన్స్ నిలయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మాతృమూర్తులకు పాదపూజ చేశారు. శ్లోకాలు, పద్యాలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## శాకంబరిగా అపర్ణాదేవి

కడియం, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీఅపర్ణ సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. మాజీ ఎంపీపీ మార్గాని లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ దంపతులు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

**బిక్కవోలులో రాజరాజేశ్వరి..**

బిక్కవోలు, జూలై 10(ఆంధ్ర జ్యోతి): గ్రామంలోని శ్రీరామ విలాస్ ధర్మ సంస్థలో శ్రీరాజ రాజేశ్వరి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పౌర్ణమి సందర్భంగా 10కిలోల కూరగాయలతో అమ్మవారిని అలంకరించామని సంస్థ ఫ్యామిలీ ఫౌండర్ అవసరాల చలపతిరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### ఐదో రోజు కొనసాగుతున్న
## పేపరు మిల్లు కార్మికుల సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం ఐదో రోజుకు చేరుకుంది. 11 కార్మిక సంఘాలు ఏకతాటికి పైకి వచ్చి వేతన ఒప్పందం అమలు చేయాలని, కార్మికుల పదవీ విరమణ వయోపరిమితి విషయంలో 60 ఏళ్ల నిబంధన ఉల్లంఘిస్తున్నం యాజమాన్య తీరుకు నిరసగా 600 మంది కార్మికులు ఈనెల 5న మధ్యాహ్నం నుంచి సమ్మెలోకి వెళ్లారు. అయితే మిల్లు యాజమాన్యం దిగిరాలేదు. దీనిపై 11 కార్మిక సంఘాలు రాజమహేంద్రవరంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. ఐదు సంవత్సరాలుగా పేపరు మిల్లి యాజమాన్యం కార్మికులు వేతన ఒప్పందం చేయకుండా నిర్లక్ష్యం వహించింది. దీనిపై గత యేడాది భారీ ఆందోళన చేశారు. సమ్మెలోకి కూడా వెళ్లారు.



# కోనేరు సుష్మంత్ వెంకట్‌కు నివాళి


వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నగర ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగర ప్రముఖుడు, టీడీపీ నేత కోనేరు మురళీ తనయుడు కోనేరు సుష్మంత్‌వెంకట్ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలో జరిగిన పెద్ద కార్యక్రమంలో పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. తొలుత కోనేరు మురళీని కలిసి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తంచేశారు. ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ జవహర్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జీఎస్ఎల్ చైర్మన్ గన్ని భాస్కరరావు, రాజమహేంద్రవరం మార్కెటింగ్ చైర్మన్ మార్ని వాసుదేవరావు, టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తదితరులు కోనేరు మురళీ కలిసి పరామర్శించారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా టీకే రిలే దీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాజమహేంద్రవరం ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి రిలే దీక్షలు చేపట్టారు. గురువారం ఉదయం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరవధిక రిలే దీక్షా శిబిరంలో టీకే విశ్వేశ్వరరెడ్డి కూర్చున్నారు. ఈ శిబిరాన్ని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ ప్రారంభించారు. రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీపీఎం నాయకుడు అరుణ్, సీపీఐ నాయకుడు టి.మధు, అశోక్‌కుమార్ జైన్, అఖిల పక్ష నాయకులు పేపరుమిల్లు విశ్రాంత అధికారుల సంఘం ప్రతినిధులు తదితరులు శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గోకవరం, జూలై10(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కామరాజుపేటలో గురువారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏడాది కాలంగా అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


రాజమహేంద్రవరం సిటీ, జూలై 10( ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ ఈటీ స్వామిదాసు అన్నారు. స్థానిక లాలాచెరువులోని శాంతి నిలయంలో గురువారం జిల్లా పాస్టర్లు, పాస్టరమ్మల ఆధ్వర్యంలో బిషప్ పొన్నమాటి బాబ్జి అధ్యక్షతన జరిగిన కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో క్రైస్తవులు సంక్షేమ అనే సదస్సు జరిగింది.

## దళిత మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

అనపర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దుప్పలపూడిలో ఈ నెల 6న దళిత మహిళ, ఆమె బంధువుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం సెక్షన్లు నమోదు చేసి అరెస్టు చేయాలని రాష్ట్ర మాదిగ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు.

## ఎన్నికల జాబితా నిర్వహణపై బీఎల్‌వోలకు శిక్షణ

రాజానగరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ లెవిల్ అధికారులకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ కార్యక్రమం స్థానిక హైస్కూల్లో గురువారం ప్రారంభమైంది. ఈ నెల 10 నుంచి 16 వరకు బ్యాచ్‌కు 50 మంది వంతున శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ చెప్పారు.





# శాకంబరిగా బాలత్రిపుర సుందరి



కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారిని కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం గురు, వ్యాస, ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ మాతగా అలంకరించారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పండితులు మానేపల్లి సుం దర గణేష్ మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. వ్యాసపూర్ణిమ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకుని సుందరేశ్వరస్వామికి విశేషపూజలు చేశారు. శాకంబరీ మాతను మహిళలు దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు.



**కళకళలాడిన వేదికలు :** రాజమహేంద్రవరం మునిసిపల్ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



**గోపాలపురం :** రాజంపాలెంలో విద్యార్థినులు.. తల్లులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్



**అమ్మా నేను ఆకాశానికెళ్లిపోతా :** బిక్కవోలులో ఇలా



నిడదవోలులో విద్యార్థికి పుస్తకం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

**తల్లికి వందనం :** అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లుల కాళ్లు కడిగి పాదాభివందనం చేస్తున్న విద్యార్థినులు

# గోదారి.. వయా..గ్రా!




మెడికల్ షాపులకు వెళ్లి ఏ మందు అడిగినా లేదనే సమాధానం రాదు..నిన్నటి వరకూ జ్వరం, దగ్గు, జలుబు మందులే అనుకుంటే.. ఇటీవల ఒక యువకుడు పట్టుబడడంతో అసలు విషయం బయటపడింది.. వయాగ్రా, అబార్షన్ మాత్రలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్టు తెలియడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నివ్వెరపోయింది.. డ్రగ్స్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి నిఘా పెట్టగా అన్ని మెడికల్ షాపుల్లోనూ ఈ తంతు నడుస్తున్నట్టు తెలుస్తోంది..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రగ్స్ శాఖ మత్తు బిళ్లలు వేసుకోవడంతో మెడికల్ షాపుల వ్యాపారం జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. అధిక శాతం మెడికల్ షాపుల్లో అడిగిందే తడవుగా విచ్చలవిడిగా మందులను విక్రయిస్తున్నారు. ఎంతలా అంటే.. వైద్యుడి చీటీ లేకుండా షెడ్యూల్ హెచ్ మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదు. కానీ అవేమీ పెద్దగా పట్టింపు లేకుండా వ్యాపారాలు నడిచిపోతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ (డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్) శాఖలోని పలువురు అధికారులు పలుకుబడి అనే మందు వాడుతుండడంతో గోదావరి జిల్లాల్లో వాడ వాడలా వయాగ్రా దొరుకుతున్నా చలనం లేదు.

## చూసీచూడనట్టు..

ఉమ్మడి జిల్లా పరిధిలో రాజమండ్రి అర్బన్, రూరల్, కొవ్వూరు, తుని, కాకినాడ రూరల్, అర్బన్, అమలాపురంలలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరికి జిల్లా అధికారిగా ఏడీ ఉంటారు.

## అసలేంటి వయాగ్రా?

వయాగ్రా అనేది తయారీ కంపెనీ పేరు. ఆ మాత్రల్లో 'సిల్డినాఫిల్ సిట్రేట్' అనే మెడిసిన్ ఉంటుంది. అన్ని మందుల మాదిరిగానే దీనినీ మెడికల్ షాపుల్లో విక్రయించవచ్చు. కానీ వైద్యుల ప్రిస్క్రిప్షన్, పర్యవేక్షణ కచ్చితంగా ఉం డాలి. ఈ మెడిసిన్‌ని లైంగిక పటుత్వం, కలయిక సమయం పెరుగుదలకు వాడతారు. పల్మనరీ హైపర్ టెన్షన్‌కి ఒక్కోసారి వైద్యులు సూచిస్తారు. బీపీ ఉన్న వారు ఈ మెడిసిన్ వాడితే నరాలు పగిలిపోయి ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ఈ ట్యాబ్లెట్లు 4.50 సంఖ్యా ప్యాక్‌లో దొరుకుతాయి. వీటిని ఆన్‌లైన్‌లో కూడా విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు.వీటికి ఉమ్మడి జిల్లాలో యువత అలవాటు పడడంతో వ్యాపారం జోరుగా సాగు తోంది.రాజమండ్రిలో 2017-18లో వయాగ్రాకు సంబంధించి కేసులు పెట్టారు. అవి ఇప్పటికీ నడుస్తున్నాయి.కొన్ని నెలల కిందట దానవాయి పేటలోని ఓ పెద్ద మెడికల్ షాపులో కాలం చెల్లిన మందులు విక్రయించగా ఓ వారం రోజుల పాటు ఆ షాపును మూతవేయించారు. తర్వాత 'ఏ జరిగిందో' ఎవరికీ తెలియదు. ఏదేమైనా చాలామటుకు దుకాణం స్థాయిలోనే సర్దు బాటు అయిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ సీరియస్‌గా దృష్టి సారించాలనే వాదన వినవస్తోంది.

వయాగ్రా అంశం గుప్పుమన్న తర్వాత పొడి పొడిగా తనిఖీలు చేశారు. కానీ ఏం జరిగిందో తెలియరాలేదు.దీనిపై ఉమ్మడి తూర్పు గోదావరి ఔషధ నియంత్రణ శాఖ ఏడీని వివరణ కోరడానికి రెండు రోజులపాటు ప్రయత్నించినా ఫోనులో అందుబాటులోకి రాలేదు. మెడికల్ షాపుల ద్వారా కొంత మొత్తం ముడు తుండడంతో కొందరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మందుల విచ్చలవిడి విక్రయాలపై గత ఏడాది అక్టోబరులో 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా హెచ్చరించింది. మందుల విక్రయాలు ఇష్టానుసారం జరుగుతున్నాయని, వైద్యులు కూడా అనవసరమైన మందులను యథాలాపంగా రాసేస్తున్నారని పేర్కొంది.

## ఎక్కడపడితే అక్కడ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1500 వరకూ మెడికల్ షాపులు ఉన్నాయి. వాటిలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నగరాల్లో 500 ఉండగా.. గ్రామాలు, మండల కేంద్రాల్లో వెయ్యి వరకూ ఉంటాయి. చాలా దుకాణాల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండానే అన్ని మం దులనూ అమ్మేస్తుంటారు.నిద్ర మాత్రలు, యాం టి బయోటిక్స్ ఇలా అన్నీ దొరికేస్తుం టాయి. గ్రామాల్లో ఈ విధమైన వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనపుగా ఒక యువకుడు వయాగ్రా, అబార్షన్ కిట్లు, అబార్షన్ ట్యాబెట్ల వ్యాపారాన్ని తెరచాటుగా విస్తరించుకున్నాడు. గ్రామాల్లో అబార్షన్ కిట్లు విచ్చలవిడిగా దొరుకుతుండ డంతో ఎలాంటి అనుమతులు, అనుభవం లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు.

## విచ్చలవిడిగా మందుల విక్రయాలు

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా ఒకే
- అందుబాటులో అబార్షన్ ట్యాబ్లెట్లు
- ఇబ్బడిముబ్బడిగా వయాగ్రా అమ్మకాలు
- దగ్గు మందులకు అడ్డేలేదు
- కొరవడిన డ్రగ్స్ శాఖ నిఘా
- మామూళ్ల మత్తే కారణం

### మందుల తీరు మాయ

గతంలో మందుల తయారీ కంపెనీలు రిప్రజెంటేటివ్స్‌ని నియమించుకుని వ్యాపారం చేసేవి.అయితే ఇప్పుడు కొత్త ఒరవడి వచ్చింది. హరియాణాలోని బడ్డి అనే ఓ ప్రాంతంలో, అలాగే గుజరాత్‌లోని పలు చోట్ల మందుల తయారీ కంపెనీలు కోకొల్లలుగా ఉంటాయి. మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అనుభవం వచ్చిన తర్వాత కొందరు డాక్టర్ల వద్ద ఆర్డర్లు తీసుకొని సొంతంగా ఆ ప్రాంతాలకు వెళ్లి పెద్ద మొత్తంలో మందులు కొనుగోలు చేసి తీసుకు రావడం మొదలైంది.దీనిని ప్రొపగాండా కం డిస్ట్రిబ్యూషన్ (పీసీడీ) అంటారు. ఆ మందులపై సొంతగా పేరు వేయించుకోవచ్చు. సాధారణంగా మందులు తయారీ నుంచి వినియోగదారుడి చేతికొచ్చేసరికి 1500 శాతం ధర పెరు గుతుంది. ఇప్పుడు వయాగ్రా, అబార్షన్ కిట్లను తీసుకొచ్చి దందా సాగిస్తున్నారని తెలుస్తోంది.

### నాడు కలెక్టర్ ఆదేశించినా..

ఉమ్మడి తూర్పులోని డ్రగ్స్ శాఖ పనితీరుకు దగ్గు మందుల అంశం మరో ఉదాహరణ. గంజాయి వంటివి కట్టడి చేసినా యువత మత్తులో జోగుతుండడంపై తూర్పు గోదావరి పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే నిఘా పెట్టగా..దగ్గు మందులను ఎక్కువ మోతాదులో తాగేస్తున్నారని తెలిసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విచ్చలవిడిగా లభ్యమవుతుండ డంపై నివ్వెరపోయారు. మెడికల్ షాపులపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.కానీ తర్వాత ఫలితం ఏమిటో డ్రగ్స్ అధికారులు బయటకు పొక్కనీయలేదు.

### డొంక కదిలిందిలా..

గణేశ్ కుమార్ అనే యువకుడు రాజమహేంద్రవరంలోని ఓ పెద్ద కంపెనీ ఫార్మసీలో కొన్నాళ్ల పనిచేశాడు. ఇదిలా ఉండగా వేరే రాష్ట్రానికి చెందిన వారితో పరిచయం ఏర్పడింది. కొన్ని ఫార్మసీ కంపెనీలు షెడ్యూల్ హెచ్ డ్రగ్స్‌ని అక్రమంగా పెద్ద మొత్తంలో అమ్ముకోడానికి ఉద్యోగులను నియమించుకుంటాయి. ఈ మా దిరిగానే గణేశ్‌కి మార్గం దొరింది. దీంతో అతడు వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు. కొన్నేళ్లుగా వయాగ్రా ట్యాబ్లెట్లు, గర్భవిచ్ఛిత్తి మందులు, కిట్లు తెచ్చి మెడికల్ షాపులకు విక్రయిస్తున్నా డు. జంగారెడ్డిగూడెంలోని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ఎత్తున ఆ మందులు పట్టుబట్టాయి. అయితే ఉమ్మడి తూర్పుగోదావరిలో కూడా ఆ అక్రమ వ్యాపారం విక్రయించిందని చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకూ డ్రగ్స్ అధికారులు మేలుకోలేదు.

# ఆనందాల బడి!

## జిల్లాలో ఘనంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

రాజమహేంద్రవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెగా పెరెంట్స్ టీచర్స్ మీట్ జిల్లాలో ఉత్సాహంగా జరిగింది. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సారి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వేడుకలను నిర్వహించారు. ఆత్మీయ సమావేశం పేరుతో బ్యానర్లను ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ పాఠశాలలకు సాదరంగా స్వాగతం పలికారు. విద్యార్థుల చదువు, నడవడిక, తీరు, ఆరోగ్యం గురించి స్కూలు ఉపాధ్యాయులు వివరిం చారు. తల్లిదండ్రులు తమ ఆలోచనలను పంచుకున్నారు. ప్రజా ప్రతినిధులు బోధన మెరుగుదల, స్కూలు అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. తొలుతగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మార్షల్ ఆర్ట్స్, విద్యార్థులు,తల్లిదండ్రుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.పాఠశాలలు, కళాశాలల్లో తల్లి పేరుతో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కలెక్టర్‌తో సహా ఉన్నతాధికారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పిల్లలతో మమేకమైపోయారు. సెల్ఫీలు దిగారు. ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. తమ చిన్ననాటి సంగతులను గుర్తు తెచ్చుకున్నారు.ఎదుగుదలకు కారణమైన అంశాలను, విజయాలను అందుకునే మార్గా లను సూచించారు. గోపాలపురం మండలం రాజంపాలెంలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు. గోకవరం మండలం కామరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్పీ పాల్గొన్నారు. వికసిత భారత్ నిర్మాణం పాఠశాల నుంచే ప్రారంభం కావాలని ఎంపీ పురందేశ్వరి అన్నారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం కార్యక్రమానికి హాజరయ్యారు. సంపూర్ణ వికాసానికి ఈ వేడుక చక్కటి వేదికనడంలో సందేహం లేదన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్యాపురం శ్రీ నన్నయ నగరపాలక సంస్థ ఉన్నత పాఠ శాలలో వేడుకలకు హాజరై మాట్లాడారు. సెల్ ఫోన్లకు బానిసలుగా మారడం వల్ల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు.గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు.నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రూరల్ టీడీపీ నా యకుడు డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జిల్లాలోని మొత్తం 976 ప్రభుత్వ పాఠశాలలు, 568 ప్రైవేటు పాఠశాలలు, 126 ఇంటర్మీడియట్ కళాశాలల్లో పీటీఎంని నిర్వహించారు. డీఈవో కె.వాసుదేవరావు తదితరులు పర్యవేక్షించారు.



**మీరు పూజనీయులు :** గోకవరం మండలం కామరాజుపేట స్కూల్ హెచ్ఎంకు ఎస్పీ నరసింహకిశోర్ సత్కారం

### తాటాకు పాకలో.. గోనె సంచులపై కూర్చుని చదువుకున్నాం

**గోకవరం :** నేను చదువుకున్న రోజుల్లో ఇపుడు ప్రభు త్వం కల్పిస్తున్న సౌకర్యాల్లో ఇసుమంతైనా ఎక్కడా కానరాలేదు. మారుమూల ప్రాంతంలోని చిన్నపాటి తాటాకు పాకలో గోనె సంచులపై కూర్చుని చదువుకున్నాం. ప్రైవేట్ పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించే ముందు ఉపాధ్యాయులకు ఓ లేఖ రాశారు. తన కుమారుడిని జాగ్రత్తగా చూసుకోవాలని..తన కుమారుడిని సన్మాన మార్గంలో నడిపించాలని కోరారు. అప్పటితో పోల్చుకుంటే మెరుగైన సౌకర్యాలు ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్నాయి. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపైన పూర్తి విశ్వసనీయత కలిగి ఉండాలి. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎస్పీని సన్మానించే ప్రయత్నం చేయగా సున్నితంగా తిరస్కరించి ఆయనే పాఠశాల హెచ్ఎం నాగేంద్రకుమార్‌ను సత్కరించారు..

**- నరసింహ కిశోర్, ఎస్పీ**



**కొవ్వూరు టోల్‌గేట్ వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీఆర్,జనసైనికుల నిరసన**

### జనసేనకు ప్రాధాన్యత ఉండడంలేదని..
# టీవీఆర్ నిరసన ప్రదర్శన

కొవ్వూరు,జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత లభించడం లేదని జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీ.వీ.రామారావు ధర్నా చేశారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు సెంటర్‌లో గురువారం ఉదయం జనసైనికులు నల్లరిబ్బన్లు ధరించి రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా చేపట్టారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీ.వీ. రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమిలో భాగస్వామ్యమైన టీడీపీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతం నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. కొవ్వూరులో కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. కొవ్వూరు నియోజకవర్గం 14 సొసైటీల్లో జనసేనకు 3 సొసైటీలు ఇవ్వాలని అడిగినా ఎటువంటి సమాచారం లేకుండా సొసైటీలకు త్రిసభ్య కమిటీలు వేసుకోవడం ఎంతవరకు సబబు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎరుబండి సురేష్, పసలపూడి తాతారావు, నామాన చిన్నబూరయ్య, కల్లూరి సుబ్రహ్మణ్యం, ముప్పనపల్లి వీరబాబు, చీకట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి పదవి నుంచి తొలగింపు

పార్టీ విధానాలకు భిన్నంగా వ్యాఖ్యలు చేయడం,కార్యక్రమాలను నిర్వహించడంతో కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పదవి నుంచి టి.వి.రామారావును తొలగిస్తూ జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంటు హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా చర్యలు ఉండడంతో తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. అయితే అంతకుముందు టీవీఆర్ కొవ్వూరులో పరిస్థితులపై సీఎం నారాచంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లకు లేఖ రాసినట్టు సమాచారం.

# స్మార్ట్..మీ..డర్!

## వద్దంటున్న వినియోగదారులు



- స్మార్ట్ మీటర్ల గందరగోళం
- ప్రభుత్వ ఆఫీస్, కమర్షియల్ ముందు
- గృహాలకు ప్రభుత్వ అనుమతి లేదు
- బిగించిన వాటికి 2 శాతం అదనపు బిల్లు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వినియోగదారులు స్మార్ట్ మీటర్ల షాక్ కొడతాయని ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్లు వద్దంటూ మొండికేస్తున్నారు. ఈ మీటర్ల మార్పు వివాదాస్పదమైంది. స్మార్ట్ మీటర్లను మార్చుకోవచ్చని చెప్పడానికి ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. అయినా ఇంత వరకూ గృహ వినియోగానికి సంబంధించి స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. స్మార్ట్ మీటర్లపై గత వైసీపీ ప్రభుత్వంలోనే ఆదానీ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చున్న సంగతి తెలిసిందే. ఈ మీటర్లు బిగిస్తే ఎక్కువ బిల్లు వస్తుందని..ఈ విధానంలో రీచార్జి ఆప్షన్ ఉండడం వల్ల బిల్లులు విధానం ఉండదని.. ముందుగా డబ్బు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అవుతుందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో గృహ వినియోగానికి సంబంధించి ఇంత వరకూ స్మార్ట్ మీటర్ల బిగింపు విషయంలో ఏ విధమైన నిర్ణయమూ తీసుకోలేదు. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరీ -2కు చెందిన వాణిజ్య రంగ వినియోగదారులకు మాత్రం తప్పనిసరిగా బిగిస్తున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలు, వీధిలైట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేస్తున్నారు.జిల్లా లో మొత్తం 10,681 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా ఇప్పటికే 9,860 మీటర్లు బిగించారు. వాణిజ్యానికి సంబంధించిన వినియోగదారులు, 500 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించిన గృహ వినియోగదారులకు బిగించాలని గుర్తించారు. కానీ కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఈ కేటగిరిలో ఒక లక్షా 40 వేల 717 మంది వినియోగదారులను గుర్తించగా ఇప్పటికే 48,115 స్మార్ట్ మీటర్లు బిగించారు. ఇందులో సుమారు 4 వేల మంది వరకూ ఎక్కువ విద్యుత్ వినియోగించే గృహ వినియో గదారులు కూడా ఉన్నట్టు గమనార్హం. కానీ అసలు గృహాలకు మీటర్లు మార్పు విష యంలో ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోక పోయినప్పటికీ.. ఓ జాబితా పట్టుకుని ఆదాని గ్రూపునకు చెందిన ఉద్యోగులు ఇళ్లు, అపార్ట్ మెంట్లకు తిరుగుతుండడం గమనార్హం. అధికా రికంగా అయితే విద్యుత్ శాఖకు సంబంధించిన ఉద్యోగి ఆధారాలతో వచ్చేవారని..అయినా స్మార్ట్ మీటర్లు బిగించడానికి తాము ఒప్పుకోమని ప్రజలు తిప్పి పంపుతున్నారు. ప్రస్తుతం బిగించిన ప్రాంతాల్లో కొంత ఎక్కువ బిల్లులు వస్తుండడం గమనార్హం. ఈ మీటర్లు బిగిస్తే 2 శాతం వరకూ పెరగవచ్చని అంచనా. స్మార్ట్ మీటరు మొబైల్ యాప్‌లో లాగిన అయితే ప్రతి అర గంటకూ ఎంత విద్యుత్ వినియోగమైందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చని..దాని వల్ల ఎంత వాడుకోవాలో తెలుసుకునే సౌలభ్యం ఉందని అధికారులు చెబుతున్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించడానికి ఎవరూ ఒప్పుకోవద్దని వామపక్షాలు, ఇతర నాయకులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నారు. ప్రజలు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఈ మీటర్లు మార్చడం అనేది వివాదాస్పదమైంది.

### పరిమితి మించిన ఇసుక లోడు..
# 7 లారీలు సీజ్

రాజమహేంద్రవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో అధిక లోడుతో ఇసుకను తీసుకెళుతున్న 7 లారీలను సీజ్ చేసినట్టు జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. వీటిలో ఆరు లారీలను రంగంపేట పోలీసుస్టేషన్, 1 లారీని కొవ్వూరు టౌన్‌స్టేషన్‌కు తదుపరి చర్యలకు అప్పగించినట్లు తెలిపారు. ఇసుక కార్యకలాపాలు నిర్వహించే ర్యాంపుల్లో అధికలోడు చేసినా, టార్పాలిన్లు కట్టకుండా ఇసుక లారీ బయటకు వచ్చినా ఆయా సొసైటీలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తామని నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. ఇసుక అధిక లోడు కారణంగా రోడ్ల మీద ఇసుక పడి ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, రోడ్లు పాడవుతున్నాయని అన్నారు. ఇక సహించేది లేదని నిబంధనలు పాటించాలన్నారు.

గురువులను స్మరించుకోవడం
మన బాధ్యత
ఎంపీ పురందేశ్వరి
ఉద్యోగం ఇప్పిస్తానని మోసం
ముగ్గురిపై కేసు
కొవ్వూరులో ఘటన 8

### అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు కొవ్వూరు సబ్ డివిజనల్ టాస్క్‌ఫోర్సు ఏఎస్ఐ జీఆర్‌కు గంగాధరరావు తెలిపారు. సీతంపేట సెంటర్‌లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో వాడపల్లి నుంచి 20 యూనిట్ల ఇసుక లోడ్‌తో తణుకు వైపు వెళ్తున్న లారీని పట్టుకొని కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు.

### అఖండ గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరిమాతకు సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం ప్రదోషకాలంలో ఆషాఢమాస పౌర్ణమిని పురస్కరించుకుని 238వ మాసోత్సవ మహా నీరాజనంలో భాగంగా అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు మహా నీరాజనం, దీపోత్సవం అందించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### వాటర్ ట్యాంకు ప్రారంభం



ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో

తాళ్లపూడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యార్థం పూర్వ విద్యార్థుల సహకారంతో సుమారు రూ. మూడు లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంకును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మలకపల్లి సొసైటీ ఛైర్మన్ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఆర్డీవో రాణీసుస్మిత, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఎంఈవో బాలామణి, కైగాల శ్రీనివాస్, ఇందుగుల రామకృష్ణ, దేవన సత్తిబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

### మార్కొండపాడు సొసైటీ అధ్యక్షుడిగా వీరరాఘవులు

చాగల్లు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్కొండపాడు సొసైటీ అధ్యక్షుడిగా మద్దిపాటి వీరరాఘవులు, సభ్యులుగా బొడ్డు వీరేంద్ర చౌదరి, ఉప్పులూరి ఆదినారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే కలవలపల్లి సొసైటీ అధ్యక్షుడిగా అబ్బూరి సీతారామాంజనేయులు, సభ్యులుగా జీ. గురుప్రసాద్, నరమామిడి పెద గోవింద్, చిక్కాల సొసైటీ అధ్యక్షుడిగా యంత్రప్రగడ అబ్బులు చౌదరి, సభ్యులుగా జే. గంగరాజు, కేతా సత్యనారాయణ నియమితులయ్యారు.

### తాడిపూడి సొసైటీ అధ్యక్షుడిగా వెంకటసుబ్బారావు

తాళ్లపూడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తాడిపూడి సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా నామా వెంకట సుబ్బారావు (కొండబాబు) నియమింపబడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన కమిటీ సభ్యులు నామా రంగ నాయకులు, గొంతు రమేష్‌తో ప్రమాణస్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. కొండబాబును కూటమి నాయకులు, పలువురు రైతులు అభినందించారు.

### డ్రైనేజీ పనుల పరిశీలన



దేవరపల్లిలో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరునెలల క్రితం దేవరపల్లిలో భారీ వర్షాలకు యాదవోలు వాగు, ఎస్సీ పేటలోని వాగు వల్ల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి అయ్యాయన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, కరుటూరి శ్రీనివాస్, ఉప్పులూరి రాంబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, తదితరులు ఉన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పట్టణానికి చెందిన కమిశెట్టి బాలకృష్ణ ఈనెల 8వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య సత్యవేణి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### మిస్టర్ సోల్జర్ చిత్రం అఖండ విజయం సాధించాలి : మంత్రి



నిడదవోలులో సినిమా ట్రైలర్ లాంచ్ ఫంక్షన్‌లో పాల్గొన్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వెండితెరపై దేశ సైనికుల గొప్పతనం వివరించేలా యథార్థ గాథతో చిత్రీకరించిన మిస్టర్ సోల్జర్ చిత్రం అఖండ విజయం సాధించాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సాయంకాలం నిడదవోలు పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో చిత్రం ప్రీ రిలీజ్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న మిలట్రీ మాధవరం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని సినిమాను తీయడం ఎంతో ఆదర్శనీయ మన్నారు. ఈ తరహా చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలన్నారు. పట్నాయక్ నిర్మాణ సారథ్యంలో బాలాజీ ముత్యాల దర్శకత్వంలో నిర్మించారు. స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ డెవలప్మెంట్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, చిత్ర సాంకేతిక బృందం, రిటైర్డ్ సోల్జర్స్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

● కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు
● పలుచోట్ల ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని సాయిబాబా ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోని సుందరసాయి ఆలయంలో గురు, వ్యాసపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఉదయం కాకడ హారతి, 7-30 గంటలకు వ్యాసపూజ, శ్రీసాయినాధుడికి ఏకాదశవార రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకరశర్మ గురుపౌర్ణమి సందేశం అందించారు. ఆలయ నిర్వాహకులు గుడివాక శ్రీనివాసరావు, సీహెచ్ సుబ్బారావు, కసిరెడ్డి సీతారామయ్య, సిహెచ్.గణేష్, డి.సురేష్, ఏ.రాంబాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పట్టణ, మండలంలోని షిర్డీ సాయిబాబా ఆల యాల్లోనూ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సాయిబాబాకు పాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



చాగల్లులో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

**చాగల్లు:** గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. చాగల్లు మెయిన్‌రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయంలో బాబాను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అన్నసమారాధన నిర్వహించారు.

**నిడదవోలు:** తాడిమళ్లలో వేంచేసివున్న నాగసాయి మందిరంలో ఉన్న షిరిడీ సాయిబాబాకు గురువారం గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రధాన అర్చకుడు కూచి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బాబాకు పంచామృత మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సుగంధ ద్రవ్య విశేష అభిషేకాలు, పురుష సూక్త సహిత విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తాతిరాజు సుబ్రహ్మణ్యం, టీవీ మధు, కాగిత రామారావు, టీ. రామశేషు, టీ.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** గురుపౌర్ణమి సందర్భంగా తాళ్లపూడి, బల్లిపాడు, పెద్దేవంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం కాకడ హారతితో మొదలై పాలు, గంధం, విభూధి, తదితర పండ్ల రసాలతో బాబాకు అన్నాభిషేకం నిర్వహించారు. తాళ్లపూడిలో అర్చకుడు చేబోలు సుబ్రహ్మణ్యం పూజా కార్యక్రమాలు చేపట్టగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు, తదితర భక్తులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**దేవరపల్లి:** దేవరపల్లి షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీహోమం

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గోష్పాదక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ధ్యాన మందిరంలో గురువారం చండీహోమాన్ని నిర్వహించారు. ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వర్యంలో భక్తులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలకవి రవీంద్రనాథ్, కస్తూరి కాంతారావు, గంప కృష్ణారావు, ముష్టి శ్రీరామచంద్రమూర్తి, బాలప్ప రాంప్రసాద్, దామరాజు సచ్చిదానంద, వాడ్రేవు సూర్య సుబ్రహ్మణ్యం, వాడ్రేవు సాయి కామరాజు, చిరావూరి సుబ్రహ్మణ్యం, పమ్మి రవిబాబు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### అన్నదేవరపేట సొసైటీ ఛైర్మన్‌గా వెంకటప్రసాద్

తాళ్లపూడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సహకార సంస్థ అభివృద్ధికి అందరి సహకారం కావాలని అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన గొరిజాల వెంకట ప్రసాద్ (జీవీ) తెలిపారు. రాష్ట్రప్రభుత్వం సొసైటీ నిర్వహణకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయగా, అన్నదేవరపేట నుంచి వెంకట ప్రసాద్ అధ్యక్షుడిగా ఎన్నికై గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షురాలు అల్లూరి ఉమ, కమిటీ సభ్యుడు వెలుగుబంటి రామకృష్ణ, చెవ్వూరి బంగార్రాజు, కూటమి నేతలు, పలు గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, జులై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం చాగల్లు ఎస్సీ ఏరియాలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కేతా సాహెబ్, జొన్నకూటి సుబ్బారావు, నందిగం శ్రీను, ఊబా దుర్గ, తాళ్లూరి ప్రసాద్, ఈదుపుగంటి మురళి పాల్గొన్నారు.

### మెగా పీటీఎం 2.0 కార్యక్రమం

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో గురువారం మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పశివేదల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న పిప్పళ్ల గౌతమ్, 5వ తరగతి చదువుతున్న పిప్పళ్ల పునీత్ తల్లికి వందనం డబ్బు రూ.26 వేలతో పాఠశాలకు బీరువా, సైన్సు బుక్స్, స్టెమ్ కిట్స్‌ను బహూకరించారు. అనంతరం పలువురు మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీడీ చైతన్య, ఎల్‌వీఎస్‌ఆర్ మూర్తి, జీ.ధనలక్ష్మి, విద్యార్థుల తల్లితండ్రులు రామాంజనేయులు, కోటేశ్వరిను అభినందించారు.

### 'హెల్పింగ్ హ్యాండ్స్' వితరణ

గోపాలపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు చేయూతనివ్వడంలోనే ఆత్మసంతృప్తి కలిగిస్తుందని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు ముత్యాల రాయుడు అన్నారు. రాజంపాలెంకి చెందిన ఉందుర్తి లోకేశ్ అనే వ్యక్తి ఇటీవల రెండవ అంతస్తునుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతడి చెయ్యికి గాయాలు కావడంతో వారి కుటుంబసభ్యులకు సేవా సంస్థ ద్వారా రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమం లో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి

నిడదవోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు విద్యాహక్కును సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సమిశ్రగూడెంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లితండ్రులకు వారి పిల్లల విద్య పురోగత, ప్రవర్తన, నైపుణ్యాలు, సామాజిక సమస్యల గురించి అవగాహన చేసుకోవడానికి సహాయపడతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు, ప్రత్యేక అధికారి దుర్గేష్, మున్సిపల్ కమీషనర్ తోట కృష్ణవేణి, తహశీల్దార్ నాగరాజు నాయక్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

**కొవ్వూరు:** విద్యార్థులు రాష్ట్రానికి మంచి గుర్తింపు తెచ్చేలా చదువుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాల, మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కరస్పాండెంట్ నెల్సన్ ఆంటోనీ మాట్లాడారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, కొప్పాక జవహర్, జనసేన నాయకులు సుంకర సత్తిబాబు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

**చాగల్లు:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ సహా అన్ని పాఠశాలల్లోనూ మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. చాగల్లు జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యా హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంసీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, ఎస్ఎంసీ ఛైర్మన్ కే. గోపాలకృష్ణ, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. ఊనగట్ల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పి. బేబీ సుజాత సొంత సొమ్ములు రూ. లక్షను గత సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ఎన్. నిధిప్రియ తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామాంజనేయులు, సుభాకర్, హెచ్‌ఎం రమణయ్య, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు పాల్గొన్నారు. మెగా పీటీఎం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.





కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

**తాళ్లపూడి:** విద్యార్థులు ఒక ప్రణాళికతో చదువుకుంటే.. భవిష్యత్ బాగుంటుందని ఆర్డీవో రాణీ సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మెగా పెరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, కైగాల శ్రీనివాస్, ఇందుగుల రామకృష్ణ, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**నల్లజర్ల:** విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై ఆసక్తి కలిగి ఉండాలని గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అన్నారు. గురువారం మండలంలోని అన్ని స్కూల్స్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వ హించారు. ప్రకాశరావుపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో బ్రహ్మరాజు పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు నిత్యం పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. అలాగే నల్లజర్ల, దూబచర్ల, పోతవరం, చీపురుగూడెం, అనంత పల్లి, శింగరాజుపాలెం స్కూల్స్‌లో జరిగిన ఈ వేడుకల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. దూబచర్ల ఏలైట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. తహశీల్దార్ నాయుడు,ఎంపీడీవో సింహాద్రిరావు పాల్గొన్నారు

**దేవరపల్లి:** విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దుద్దుకూరు రంగరాయ జడ్పీహైస్కూల్‌లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ నాయకులు ముళ్లపూడి దొరాజీ చౌదరి, ముళ్లపూడి సత్యనారాయణ, కొయ్యలమూడి తాతారావు, సర్పంచ్ బొంతానాగమణి, ఉపసర్పంచ్ రవికుమార్, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుకంర దుర్గారావు, తదితరుల పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** విద్యార్థుల భవిష్యత్ ఉన్నతి స్థితికి చేరాలంటే ఉపాధ్యాయులు, తలిదండ్రుల బాధ్యత ఎక్కువగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం ఉండ్రాజవరం హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కూటమి నేతలు సింహాద్రి రామకృష్ణ, వీరమల్ల బాలాజీ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సత్యనారాయణ

**గోపాలపురం:** అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని ప్రసాదించే తరగతి గది దేవాలయాలతో సమానమని టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్య నారాయణ అన్నారు. మహాత్మాజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ డే కార్యక్రమానికి హాజరయ్యారు.పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కే.జ్యోతి,బూత్ ఛైర్మన్ శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ సభ్యులు శ్యామ్ పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో లోపాలను చర్చించేందుకు మెగా పేరెంట్స్ డే

### కలెక్టర్ ప్రశాంతి



గోపాలపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం, లోపాలను చర్చించేందుకు మెగా పేరెంట్స్ డే కార్యక్రమా లు చక్కని వేదికగా నిలుస్తాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని కొవ్వూరుపాడు,రాజంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు చిన్న వయసులోనే మంచి అల వాట్లు అలవరుచుకునే విధంగా అవసరమైన శిక్షణను తల్లిదండ్రులే ఇవ్వాలన్నారు. అనం తరం రాజంపాలెం జడ్పీహైస్కూల్ పేరెంట్స్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అక్కడి విద్యా ర్థులు, తల్లులతో కలిసి మధ్యాహ్న భోజ నం చేశారు. ఈ సందర్భంగా సైకిల్‌షెడ్డు, భోజనశాలను తాడేపల్లి హరి చంద్రప్రసాద్, విజయ కుమారి దంపతులు కాకర్ల వెంకటరత్నం, సూర్యకాంతం పుణ్యదంపతుల జ్ఞాపకార్థం నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సర్వశిక్షఅభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి, నియోజకవర్గ మహిళా అధ్య క్షురాలు కాకర్ల జగదీశ్ రామ తులసి, ముత్యాల రాయుడు, గడా భాస్కరరావు, ఆలపాటి రాజ యోగం, తహశీల్దార్ అజయ్‌బాబు, ఎంపీడీవో రాజమనోహర్, ఎస్ఐ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

### గురువులను స్మరించుకోవడం మన బాధ్యత : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చీకటిని ప్రారద్రోలి వెలుగును నింపేవాడే గురువు అని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు శ్రీరామానంద గౌడీయామఠంలో బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కార్యదర్శి తాడిమళ్ల విజయవాణి ఆధ్వర్యంలో గురువారం గురుపౌర్ణమిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీను ఏబీఎన్ కళాశాల అడ్వయిజర్ నందిగం సుబ్బారావు, ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ, గౌడీయామఠం స్వామిజీ భక్తి విభుద వామన మహరాజ్, మడిచర్ల రామచంద్రరావు, వారాహి పీఠాధిపతి దుర్గాప్రసాద్, గోవర్ధనం శ్రీనివాసమూర్తి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధ, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, 9వ వార్డు బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ముప్పరాజు శ్రీనివాసరావు, బోడపాటి ముత్యాలరావు, బూసి సురేంద్రనాథ్ బెనర్జి, టీఎన్‌వీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

#### బౌద్ధదమ్మ పీఠం సేవలు ఆదర్శనీయం

ఉండ్రాజవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బౌద్ధదమ్మపీఠం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం స్థానిక బుద్ధ విహార్, బౌద్ధదమ్మపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పీఠం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, టీడీపీ నాయకులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, సింహాద్రి రామకృష్ణ, గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన రాజ్యం పాస్టర్ అమ్మ 2000వ సంవత్సరం నుంచి పశివేదల వచ్చి ఇంటింటికి తిరిగి సువార్త చెబుతూ ఉండేది. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ ముప్పిడి ప్రభావతితో పరిచయం పెంచుకుంది. రాజ్యం పాస్టర్ అమ్మ తన కుమార్తె ఉండిలో యోగా టీచర్‌గా పనిచేస్తుందని, మీ కుమారుడికి కూడా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆరేపల్లి విశ్వజ్యోతి, ఆరేపల్లి ఏసురత్నంతో కలిసి ప్రభావతి నుంచి రూ. 3 లక్షలు తీసుకున్నారు. ఆ తరువాత రూ. లక్ష తిరిగి ఇచ్చేశారు. మరలా 2022 డిసెంబరులో రూ.60 వేలు తీసుకున్నారు. అయితే తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని సదరు వ్యక్తులను ప్రభావతి అడుగ్గా ఇస్తామని చెప్పి కాలక్షేపం చేస్తూ వచ్చారు. తీరా డబ్బులు ఇచ్చినట్టు ప్రూఫ్ ఏంటీ, నీ దిక్కు వున్న చోట చెప్పుకో అని దుర్భాషలాడినట్టు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

### వివాహితకు ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర పోస్టులు ... కేసు నమోదు

నిడదవోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జీడీగుంటకు చెందిన ఓ వివాహితపై కోరిపల్లికి చెందిన ఆమె మరిది కారింకి బుల్లిరాజు ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో ఆమె ఫిర్యాదు మేరకు నిడదవోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నిడదవోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ శివారులో నివాసముంటున్న బర్రె అబ్రహం లింకన్ (53) ఆర్థిక ఇబ్బందులు తాళలేక గురువారం ఇంటో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై పట్టణ ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈయన హోటల్లో క్యాషియర్‌గా పనిచేసేవాడు.